Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.11

September 2023




## క్రీస్తులో ఐక్యత



ఎడిటోరియల్

# అందరి బాధ్యత

రాజీవ్ బిటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. తల్లిదండ్రులు కష్టపడి వ్యవసాయం చేస్తూ రాజీవ్‌ను ప్రయోజకుడిని చేయాలని చదివిస్తూ ఉంటే, తల్లిదండ్రుల ఆశలకు వ్యతిరేకంగా రాజీవ్ ఉత్సాహంగా, ఉల్లాసంగా జీవిస్తూ బెట్టింగ్‌లకు, పోర్నోగ్రఫీ చూడడానికి అలవాటై, డబ్బుకోసం తన బంగారపు గొలుసు, ల్యాప్‌టాప్ తాకట్టు పెట్టాడు. తెలిసినవాళ్ళ దగ్గర అప్పులు చేయడం మొదలుపెట్టాడు. తాను ఊబిలోకి దిగుతున్నాననే గ్రహింపు వచ్చేసరికి పీకల్లోతుల్లో మునిగిపోయాడు. రాత్రులు నిద్రలేక ఆరోగ్యం పాడై నిరాశ, నిశ్పృహలకు లోనై జీవితంపై విరక్తి పెంచుకొన్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసి గుండెలు బాదుకొని, కుమిలి కుమిలి ఏడ్చారు. కొడుకు మీద ప్రేమతో ఆ అప్పులన్నీ తీర్చి మరలా వాటి జోలికి వెళ్ళవద్దని గట్టిగా హెచ్చరించి వెళ్ళిపోయారు. అదే సమయంలో క్రైస్తవ స్నేహితుల బలవంతం మీద ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు వచ్చి తన పాప జీవితాన్ని గుర్తించి, యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించి నూతన జీవితాన్ని జీవించాలనే ఉత్సాహంతో హాస్టల్‌కు వచ్చాడు. కొన్ని రోజులు మంచిగానే ఉన్నా మరలా పాత జీవితానికి అలవాటయ్యాడు. ఈసారి లక్షల్లో అప్పు చేసి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. మరలా స్నేహితుల బలవంతం మీద ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు వచ్చి తన పాప జీవితాన్ని ఒప్పుకొన్నాడు. క్యాంప్ నుంచి వెళ్ళిన తర్వాత దేవునిలో ఉంటానో లేనో అనే భయం అతనికి ఉంది.

సతీష్ ఇంటర్ మొదటి సం॥ చదువుతున్నాడు. ఇంట్లో గొడవలై సతీష్ తండ్రి ఇంటినుంచి వెళ్ళిపోయాడు. తల్లే కష్టపడి పెంచుతుంది. కాలేజ్ నుంచి రాగానే తన మరదలితో ఛాటింగ్ చేస్తాడు లేదా రోజులో ఖాళీ దొరికినప్పుడు ఫోన్ తీసుకొని కనీసం మూడు గంటలైనా చూస్తాడు. పోర్నోగ్రఫీకి అలవాటై పోయాడు. ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు వచ్చి దేవునిని అంగీకరించాడు. కొంతకాలం బాగానే ఉన్నాడు. మరలా యధాస్థితి. మరలా క్యాంప్‌కు వచ్చి తన పాపాల్ని ఒప్పుకొన్నాడు.

రాకేష్ ఇంటర్ రెండవ సం॥ చదువుతున్నాడు. స్నేహితుల ప్రభావం ఇతని మీద ఎక్కువగా ఉంది. దేవుని నమ్మాడు. స్నేహితులు ఎగతాళి చేస్తారనే భయం అతనికి ఉంది.

విద్యార్థులు క్యాంప్స్‌లో, గాస్పల్ మీటింగ్స్‌లో చేసే తీర్మానం ఆరంభం మాత్రమే. వీళ్ళు ఆధ్యాత్మికంగా ఎదగడం, ప్రభావవంతంగా క్రైస్తవ సాక్ష్యాన్ని కలిగి జీవించడం అనేది మనం వాళ్ళకి అందించే ప్రార్థనా సహకారం, వ్యక్తిగత శ్రద్ధపై ఆధారపడి ఉంటుంది. ఈ పనిలో ఫాలోఅప్ ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రాజీవ్, సతీష్, రాకేష్ లనే కాదు రాష్ట్రంలో చాలామంది జీవితాల్ని గమనిస్తే వారిని క్యాంప్‌లకు తీసుకొచ్చేటప్పుడు తీసుకొనే శ్రద్ధ ఫాలోఅప్ విషయంలో కనబడడం లేదని అర్థమవుతుంది. ప్రభువుని అంగీకరించక ముందు అనేక వ్యసనాలతో జీవించిన వారు ప్రభువును అంగీకరించాక ఆ వ్యసనాల నుంచి బయట పడడానికి, ప్రభువులో స్థిరపడడానికి వారి పట్ల మనమెంత శ్రద్ధ తీసుకోవాలి? ఒకటి లేదా రెండు సార్లు ఫాలోఅప్ కార్యక్రమాలు నిర్వహిస్తే సరిపోతుందా? వారు దేవునిలో స్థిరపడేవరకు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోనవసరం లేదా? ఆ శ్రద్ధ లేకనే మరలా వారు పాత జీవితంలోకి వెళ్తున్నారు. రెండవసారి, మూడవసారి కూడా వారిని క్యాంప్‌కు తీసుకొని వస్తున్నామంటే చేసిన పనినే మరలా మరలా చేస్తూ, ఫలంలేని పరిచర్య చేయడానికి ప్రయాస పడుతున్నాము.

“పిల్లల్ని కని ముళ్ళపొదల్లో విసిరేశారు, రోడ్డు పక్కన వదిలేశారు, పెంచడం చేతగాక వీళ్ళు అనాధల్లా మిగిలారు” అనే మాటల్ని వార్తా పత్రికల్లో చదివినప్పుడు, అలాంటి వారిని సమాజంలో చూస్తున్నప్పుడు ఆవేశంతో ఊగిపోతూ, జాలి, కనికరం, బాధ్యత లేనివారని, అలా ఎలా చేయగలుగుతారని మాట్లాడతాం, ఎంతో ఆవేదన చెందుతాం. మనం కూడా నూతన విశ్వాసుల్ని పట్టించుకోకుండా వదిలేస్తూ, వారు విశ్వాసం నుంచి వైదొలగడానికి, పతనమవ్వడానికి కారకులమైన మనల్ని, ఆత్మీయంగా పెంచడం చేతగాక అనేకుల్ని అనాధలుగా వదిలేసిన మన గురించి ఏమనుకోవాలి? వీరిందరి గూర్చిన లెక్క దేవుడు మనల్ని అడగడా? ఖచ్చితంగా అడుగుతాడు.


యేసుక్రీస్తు తన శిష్యులను ప్రేమించిన తీరు, వారి పట్ల తీసుకొన్న శ్రద్ధ, బర్నబా – పౌలును దగ్గరకు తీసిన తీరు (అ.కా. 9:27; 11:25), పౌలు, బర్నబాలు కలసి నూతన విశ్వాసులను ఆత్మీయంగా స్థిరపరిచిన విధానం (అ.కా. 15:36) మనకెంతో మాదిరి. విశ్వాసులను దేవునిలో స్థిరపరచే విషయంలో, ఫాలోఅప్ చేసే విషయంలో అపొస్తలుడైన పౌలు పడిన ప్రయాస, చూపిన ప్రేమ, శ్రద్ధ, వారికోసం కార్చిన కన్నీరు మనకెంతో ప్రోత్సాహాన్నిస్తుంది. విశ్వాసులను స్థిరపరచే విషయంలో తన ప్రాణాన్ని సహితం ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డాడు. (1 థెస్స 2:7-8; గలతీ 4:19).

క్యాంప్‌లు, కాన్ఫరెన్స్‌లు, కార్యక్రమాలు నిర్వహించడానికి ఎలా శ్రద్ధ తీసుకొంటామో, ఎలా ఐక్యతతో పనిచేస్తామో, నూతన విశ్వాసులను ఫాలోఅప్ చేసే విషయంలో కూడా అలానే చేయాలి. ఏదో కొద్ది మంది మాత్రమే గాకుండా ప్రతి ఒక్కరు ఈ విషయంలో బాధ్యత వహించాలి, ప్రార్థించాలి, ప్రయాసపడాలి. అలా చేస్తే పరిచర్యలో గొప్ప ఫలాన్ని చూస్తాము, దేవునిచేత మెప్పు పొందుతాం. లేకపోతే పరిచర్య పతనాన్ని చూస్తాం.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల

Vol. 29, No.11 September 2023
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

October: Power through Prayer
November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**


## ఐక్యతకు మూలం

ఇంగ్లీష్ బైబిల్లోని యెషయా 14:13-14 వచనాల్లో సాతాను గురించి చూసినప్పుడు ఐదు సార్లు 'ఐ విల్' అనే పదాలు ఉంటాయి. సాతాను అంటే 'ఐ', 'ఐ' అంటే సాతాను. గనుక ఎప్పుడన్నా 'ఐ' అనే పదం మనలో కొంచెం పైకొస్తే సాతానులా మనలో కూడా గర్వం ఉందని అర్థం. పాపాలన్నిటిలోకెల్ల ప్రధాన పాపం "గర్వం". సాతాను కూడా గర్వంతోనే పతనమయ్యాడు. చాలాసార్లు చింత చచ్చినా పులుపు చావదన్నట్లు మనలో కూడా ఇది చావదు. గనుక గర్వాన్ని గూర్చి జాగ్రత్తగా ఉంటూ, తన్ను తాను ఉపేక్షించుకొని ప్రతిదినం తన సిలువను ఎత్తుకొని ఆయనను వెంబడించాలి. ఇలాంటి మనసు సహవాసంలో ఐక్యతకు దారి తీస్తుంది.

## లోపలి పేజీల్లో...


- అందరి బాధ్యత - 2
- 69 = 6 ? ! 🙂 - 4
- ఐక్యతకు ఆధారం - 5
- రండి కలసి పోరాడదాం - 8
- కలిసి జీవిద్దాం, కలిసి పని చేద్దాం - 11
- ఐకమత్యమే బలం - 14
- క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలు - 15
- ఐక్యతకు చిరునామా- 17
- పాలికార్ప్ - 18
- పుకార్లు కలిగించే నష్టం - 21
- ప్రాధాన్యతల్లో తారుమారు - 22
- అపవిత్రత నుండి పవిత్రతలోకి.. - 26
- ఆలస్యం ఆశీర్వాదం కోసమే - 29
- కోశాధికారి లేఖ - 31
- నేనే - 32

# 69=6 ?!

**రిపోర్టర్:** క్రైస్తవులు చాలా మందిని మతం మారుస్తున్నారని అంటున్నారు, దాని గురించి మీ అభిప్రాయం ఏమిటి?

**సమాధానం:** "ఇది ఎంతవరకు నిజమో నాకు తెలియదు, కానీ క్రైస్తవులు క్రూరులను, ఉన్మాదులను, హంతకులను, నేరస్తులను, దొంగలను మనుష్యులుగా మారుస్తారని మాత్రమే చెప్పగలను" అని భారతదేశ మాజీ ప్రధాని స్పందించినట్లుగా సోషల్ మీడియాలో చూశాం.

మానవ జీవితంలో అత్యంత వినోద భరితమైన దశ విద్యార్థి దశ. ఈ దశలో ఉన్న వారిని విజ్ఞానవంతులుగా, వివేకవంతులుగా, వికసించేవారిగా చేసి భారతదేశంలో వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకే 69 సంవత్సరాల క్రితం యుఇయస్ఐ ఉనికిలోకి వచ్చింది. 1954వ సం॥ నుంచి ఇంతవరకు ఎంతోమందిని ఈ పరిచర్య భారతదేశం గర్వించేలా తీర్చిదిద్దింది. అయితే తన సామర్థ్యం కొలది చేయలేదని, సాధించాల్సినంత సాధించలేదని స్పష్టమవుతుంది. సెప్టెంబర్ 18న మరో నూతన సం॥లోకి ప్రవేశించే ముందు మన పరిశీలనకు ఒక పరీక్ష, మన సామర్థ్యానికి ఒక సవాలు.



గత 69 సంవత్సరాల్లో సాధించినది రానున్న 6 సంవత్సరాల్లో సాధించాలంటే, మన సభ్యులందరిలో ప్రతిజ్ఞతో కూడిన ప్రయాస అవసరమేమో! ఈ ప్రయత్నంలో భాగంగా, మన యల్ఆర్పి-2030లో మొదటి ఫోకస్ ఏరియా 'ప్రార్థన పట్ల ఆసక్తిని పెంపొందించడం' పై మన దృష్టి పెడితే బాగుంటుందని నా అభిప్రాయం. దీనిని ప్రయోగాత్మకంగా పాటించే ప్రక్రియలో...

- మనలో ప్రతి ఒక్కరం మన స్థానిక ఇయు, ఇజియఫ్ సభ్యుల కోసం ప్రతిదినం ప్రార్థించాలి.
- ఆర్డిసి, డిస్ట్రిక్ట్, రీజినల్ కమిటీస్ కోసం వారంలో కనీసం ఒకసారి ప్రార్థించాలి.
- ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఏపి-ఇజియఫ్, యస్డిసి, డిపార్ట్మెంట్స్, స్టాఫ్ కోసం నెలలో కనీసం ఒకసారి ప్రార్థించాలి.

"మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మది గాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరి కొరకును రాజులకొరకును అధికారులందరికొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని" పౌలు తిమోతిని హెచ్చరించాడు (1తిమోతి 2:1). ఈ హెచ్చరికను మనం కూడా తీసుకొని మనుష్యులందరిలో ఇయు, ఇజియఫ్ వారు కూడా ఉన్నారు గనుక వీరితో ప్రారంభించి, మిగిలిన వారి కొరకు కూడా ప్రార్థించడంలో ఎదుగుదాం.

ఇలా ప్రార్థించగా వచ్చిన సామర్థ్యం, దేవుని నడిపింపుతో మన రాష్ట్రంలో, దేశంలో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు క్రీస్తు ప్రేమను పరిచయం చేయాలి. ఇలా జరగాలంటే కేవలం మన పూర్వీకులైన ఇనాక్, జోసఫ్ అభిషేకరావు గార్ల గురించి చదివి, చెప్పడం మాత్రమే కాకుండా, వారివలే ప్రతిదినం జీవించడానికి ప్రయత్నం చేయాలి. ఒక వారం, ఒక నెల, ఒక సంవత్సరం, జీవితాంతం ఇలా ప్రయత్నిస్తూనే ఉండాలి.

ప్రార్థన గూర్చి ప్రసంగం చేయడంతో పాటు
ప్రార్థనే ప్రాధాన్యతగా పాటించినప్పుడు
ప్రభువు, మన కళ్ళతో 69=6 ను చూసేటట్లు చేస్తాడు.

అప్పుడు ముందు **ప్రశ్నార్థకంగా** చూసిన మనం, అభివృద్ధి సాధిస్తున్నప్పుడు **ఆశ్చర్యంగా** చూస్తాం. చివరకు **ఆనందంగా** ఆయనను ఆరాధిస్తాం.

ఆయన ప్రణాళికలో మీ....

**ఆర్. శ్రీనివాస్**
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# ఐక్యతకు ఆధారం

**ఎఫెసీ 4:1-16**

ప్రస్తుత సమాజము విభజన గోడల మధ్య ఊపిరాడక సొమ్మసిల్లిపోతోంది. విభజించి ఏలుబడి చేసే వ్యవస్థల చేతుల్లో నలిగిపోతూ వికసించడానికి ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటుంది.

చరిత్రలో కార్ల్‌మార్క్స్ లాంటి వాళ్ళు సమానత్వాన్ని, ఐక్యతను కలిగిన నవ సమాజ నిర్మాణానికి పూనుకొన్నా అది సాధ్యం కాలేదు. ఇప్పటికి కూడా ఒక పక్క ఐక్యత గురించి మాట్లాడుతూ మరొక పక్క కుల, మత, ప్రాంతీయ వివక్షలను ప్రోత్సహించి విధ్వంస చర్యలను రెచ్చగొడుతూ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావజాలానికి తూట్లు పొడుస్తున్నారు. అయితే మచ్చుకు మనం ఇటీవల చూసిన రెండు వర్గాలు ఒకే ప్రాంతంలో జీవిస్తూ ఉన్నవాళ్లు ఉన్నట్లుండి భయంకరమైన పోరుతో రగిలి పోయారు. అల్లర్లు, హత్యలతో కూడిన మారణకాండ మధ్యలో రాజకీయ నాయకులు ఐక్యత గురించి మాట్లాడారు, ఉద్యమకారులు పాటలు రాశారు, జర్నలిస్ట్‌లు వాస్తవాలను వెలికి తీశారు. పోలీసులు చేరుకొన్నారు గానీ పొసగని రెండు వర్గాల మధ్య ఐక్యతను తీసుకురాలేకపోవడం కళ్ళారా చూశాం.

ఇటువంటి భయానక పరిస్థితుల్లో వ్యక్తులు భౌతికంగా మానసికంగా దూరమవుతున్నారే తప్ప ఏకమవడం లేదు.

ఇలాంటి సమాజానికి భిన్నంగా నూతన సమాజము, యేసుప్రభువు ఇచ్చే నూతన జీవితం ద్వారా అంటే రక్షణ కార్యం ద్వారా నిర్మించబడుతుంది. పొసగని గుంపులను సమాధానపరచి ఐక్యతను తెచ్చిన ప్రభువు రక్తంలో ఉన్న సామర్థ్యం ఏ మానవ శక్తిలో లేదు. దేవునితో సమాధానం, తోటి మనిషితో సమాధానం రెండూ దేవుని కార్యమే.

ఎఫెసీ పత్రిక ప్రకారం ఈ నూతన సమాజానికి ఉండాల్సిన ప్రాముఖ్యమైన రెండు సుగుణాలు ఏంటంటే మొదటిది ఐక్యత, రెండవది పవిత్రత. క్రైస్తవ ఐక్యత అనేది సంస్థాగతమైన ఐక్యత కాదు, ప్రతి సిద్ధాంతముపై ఏకత్వము కాదు, బాహ్యమైన ఏక రూపత కాదు. అసలు ఐక్యత అంటే బాహ్యమైన అలంకరణల ద్వారా తీసుకొచ్చేదికాదు. ఒకవేళ బాహ్యమైన వస్త్రధారణ, సాంస్కృతిక పద్ధతులు చూపేది సమరూపకతే. ఉదాహరణకు అందరూ ఒక కండువా వేసుకోవచ్చు, ఒకే స్టేజ్ వాడొచ్చు. వారిలో అంతర్గత విబేధాలు పెరిగి కండువా మార్చుకోవచ్చు, స్టేజి మార్చుకోవచ్చు. అందుకనే ఐక్యత బాహ్యపరమైన మార్పులు ద్వారా వచ్చేది కాదు. దేవుడు తీసుకొచ్చే అంతర్గతమైన మార్పు నుండే ఐక్యత సాధ్యపడుతుంది. ఇలాంటి ఐక్యతలో ఏకమనసు, ఏక భావం, ఏక తాత్పర్యం, సమానత్వము కలిగి ఉంటుంది. అందుకనే ఎఫెసీ 4:1లో దీన్ని పరిశుద్ధాత్మ కల్గించే ఐక్యత అని పౌలు గారు అన్నారు. ఈ వచనంలో ఇంకా చూస్తే ఆత్మ దేవుడు కలిగించే ఐక్యత క్రైస్తవుల మధ్యలో కనిపించాలంటే ఆటోమేటిక్‌గా అయిపోదు గాని ఈ ఐక్యతను కాపాడుకోవడానికి



నూతన సమాజమైన క్రైస్తవ సహవాసంలోనూ, కుటుంబంలోనూ, ప్రతి వ్యక్తి శ్రద్ధ కల్గి ఉండాలి, నిరంతర ప్రయత్నం చేయాలి. అందుకే యేసుప్రభువు యోహాను 17వ అధ్యాయంలో అప్పటి శిష్యులు, విశ్వాసులందరి ఐక్యత కొరకు తరాలకు సరిపడా ప్రార్థన చేశారు. ఈ ఐక్యత తండ్రియైన దేవునికి, కుమారుడైన దేవునికి ఉన్న ఐక్యతలాంటిది (వ21). అంటే త్రియేక దేవునిలో ఉండే పరిపూర్ణమైన ఐక్యము జీవములో స్వభావములో ఏకత్వము. సహవాసంలో విశ్వాసుల ఐక్యతను వారి చుట్టూ ఉన్న ప్రజలు చూసి దేవుని కుమారుని నమ్ముతారు. విశ్వాసుల మధ్య ఐక్యత త్రియేక దేవుని వ్యక్తిత్వానికి, ఆయనలో ఉన్న ఏకత్వానికి అద్దం పట్టాలని ప్రార్థన చేశారు.

అయితే క్రీస్తు ప్రభువు విశ్వాసుల ఐక్యతకు ప్రాణాన్ని అర్పించారు, ప్రార్థించారు. విశ్వాసులు ఐక్యతను శ్రద్ధతో కాపాడుకోవడానికి ఆధారాలు ఎఫెసీ 4:2-16 వచనాల్లో చూస్తాము. ఇందులో నవసమాజపు విశ్వాసులు పిలుపుకు తగినట్లు ఐక్యత కలిగినడుచుకోవడానికి అపొస్తలుడైన పౌలు నాలుగు విషయాలు ప్రస్తావించాడు.

**మొదటిగా,** క్రైస్తవ సహవాసంలోని ఐక్యత విశ్వాసుల పాత్ర, ప్రవర్తన యొక్క దాతృత్వము మీద ఆధారపడి ఉంటుంది. 2వ వచనం, ఈ ప్రవర్తన నియమావళిలో కింది లక్షణాలు ప్రస్తావించాడు.

1. **సంపూర్ణ వినయము:** ఈ లక్షణం ద్వారా సహవాసంలోని ఇతరుల యోగ్యత, విలువను గుర్తిస్తుంది. ఒకరి దగ్గర ఒకరు నేర్చుకోవడానికి, తమకంటే యోగ్యులని ఎంచడానికి వినయం అవసరం కదా.
2. **సాత్వికము:** దేవునియందు మనుష్యులమైన మనం యధార్థంగా ఉండడం. ఒక మాట లేక ఒక దెబ్బ కొట్టగలిగే సామర్థ్యం ఉన్నప్పటికీ ఇతరులతో తిరగబడక తన ఆధీనంలో తను ఉండడం ద్వారా సాధించే ఐక్యత.
3. **సహనము:** సహవాసంలో వేర్వేరు స్వభావాలు, నేపథ్యం గలిగిన వారి మధ్యలో ఎంతో సహనం కలిగి, ఓర్చుకోవడం అందరిని ప్రభావితం చేస్తుంది.
4. **ఒకరినొకరు భరించడం:** ఇతరుల మనస్తత్వాలను భరించడం, వారి మనోభావాలను కష్ట పరిస్థితుల్లో గౌరవించడం ఐక్యతకు అవసరం.
5. **ప్రేమ:** ఇటుకల మధ్య సిమెంట్ బంధించే సాధనంగా పనిచేసినట్లు, ప్రేమ అనే బంధం ద్వారా ఒకరికొకరం ఒక కుటుంబంగా బంధాలు కలిగి ఉంటాము. అందుకే క్రైస్తవ సహవాసంలో ఉన్న బంధం భౌతిక/రక్త సంబంధాలకన్నా మించినదిగా ఉంటుంది. ప్రేమ నిర్వచనం ప్రకారం ప్రేమ అన్నిటికంటే మించినది.

**రెండవదిగా,** సహవాసంలోని ఐక్యతకు ఆధారం మనం నమ్మే త్రియేక దేవుడే.

వ. 3-6. త్రియేక దేవునిలోని ఐక్యత నుంచే మన ఐక్యత పుడుతుంది. తండ్రి దేవుని ద్వారా మనది ఒకే కుటుంబం. యేసుప్రభువు చేసిన సార్వత్రిక రక్షణ కార్యమును బట్టి మనందరిది ఒకే విశ్వాసం, పరిశుద్ధాత్మ ద్వారా రక్షణ పొందిన మనమందరం ఒకే శరీరంలోనికి చేర్చబడ్డాము. దైవత్వంలో ఐక్యమైన ఈ ముగ్గురు దైవత్వంలో సమానంగా ఉంటూ వారు వేరు వేరు పనులు కలిగి ఉన్నప్పటికీ ఈ ముగ్గురు కూడా సృష్టి కార్యంలో, విమోచనలో కలిసి పనిచేసినట్లు చూస్తాము.

అందరి విశ్వాసం అమూల్యమైనది, అందరికి ఒకే తండ్రి, ఒకే ఆత్మ దేవుడు మనల్ని ఐక్యం చేశాడు. అయితే, విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా, కుటుంబాలుగా, స్టాఫ్‌గా ఒకే లక్ష్యం కొరకు ఐక్యతతో కలిసి పనిచేస్తాం.

**మూడవదిగా,** విశ్వాసుల ఐక్యత కృపా వరాల వైవిధ్యంతో సుసంపన్నమవుతుంది. క్రైస్తవ సహవాసంలో ప్రతి ఒక్కరికీ ఆత్మదేవుడు వేరువేరు వరాలను పంచి ఇస్తాడు (వ. 7-12). ఈ వైవిధ్యభరితమైన వరాలను అభ్యాసం చేయడం

ద్వారా ఒకరికొకరు పరిచర్య చేసుకొంటాం. తద్వారా సంఘ క్షేమాభివృద్ధి కలుగుతుంది, సంఘ పరిచర్య ఎక్విప్ అయ్యి సుసంపన్నం అవుతుంది, ప్రేషిత ఉద్యమంలో నిమగ్నమవుతుంది.

**నాల్గవదిగా,** విశ్వాసుల ఐక్యత విశ్వాసుల పరిపక్వతను డిమాండ్ చేస్తుంది (వ 13-16). విశ్వాసుల ఐక్యత ద్వారా సమాజం పరిపక్వమవుతుంది. ఏవిధంగా అంటే వ్యక్తులను సరిచేసేటప్పుడు ఐక్యతను కాపాడుకొంటూ వ్యక్తులకు కష్టమైనా ప్రేమతో సత్యాన్ని చెప్పగలిగే పరిపక్వతకు ఎదగాలి. తిరగబడకుండా కృతజ్ఞతతో సరిచేసుకొనే మనసు కూడా పరిపక్వతకు గుర్తుగా ఉన్న ఐక్యతను పెంపొందిస్తుంది.

ఇలాంటి పరిపక్వతతో కూడిన ఐక్యత మన కుటుంబాల్లో, సహవాసాల్లో కనబరుస్తూ, త్రియేక దేవుని ప్రతిబింబించాలి.

## ఐక్యతకు ఆటంకాలు

ఐక్యతను ఆటంకపరిచి విచ్ఛిన్నం చేసేవి ఏంటి? ఐక్యత లేకపోతే ఏమవుతుంది? ఈ విషయాలు తెలియకపోతే ఐక్యతను కాపాడుకోలేక కుటుంబంగా, సహవాసంగా, సంఘంగా ఎంతో నష్టపోతాము.

- కలహాలు/విభజనలు - 1 కొరింథీ 1:10-11- గర్వము, దురహంకారము, తనను ఇతరుల కంటె హెచ్చించుకోవడమనేది విశ్వాసుల మధ్య స్నేహాన్ని, ఐక్యతను చెరుపుతుంది.
- అసూయలు, మనస్పర్ధలు, విభేదాలు, కక్షలు - గలతీ 5:20
- మాటలలో తప్పిపోవడం - అబద్ధాలు, దూషణ మాటలు (ఎఫెసీ 4:29-31), గాసిప్స్, కొండెములు మొదలైన వాటిద్వారా దేవుని రాజ్యమును కూల్చే వారిగా ఉంటామే గాని దేవుని రాజ్యాన్ని నిర్మించే వారంగా ఉండలేము.
- "స్థానాభిమానము" కుర్చీల కోసం కుమ్ములాటలు, అధికారం కోసం ఆరాటం. ఉదా. యాకోబు మరియు యోహాను తల్లి (మత్త 20 :22-28). ఇవి సహవాసాలను, సంఘాలను విభజిస్తాయి.
- మొండితనము - పౌలు, బర్నబాలు (అపో. కార్య. 15: 35-41) జాన్ మార్క్‌పై భిన్నాభిప్రాయాలతో విడిపోయారు. కానీ పౌలు తర్వాత జాన్ మార్క్‌తో సమాధానపడి అభినందించడం చూస్తాము.

ఇలాంటి అనేకమైనవి ఎన్నో !!! కుటుంబంలో, సంఘాలలో అనైక్యతకు దారితీసి సాతాను చొరబడడానికి చోటిచ్చి, శత్రువు స్థావరాలుగా మారి నాశనమయ్యాయి.



కుటుంబంలో భార్యాభర్తల అనైక్యత, క్షమించుకోలేనితనం, మాటిమాటికి మనసుకు కలిగిన గాయాలను గుర్తుచేసుకొంటూ ఎడమొహం, పెడమొహంగా ఉంటూ పిల్లలకు కూడా నెమ్మదిలేని ఇల్లుగా చేస్తూ ఎంతో కోల్పోతున్నారు.

కొన్నిసార్లు మోసాలకు అబద్దాలకు, అసత్యాలకు ఏకమైన అననీయ సప్పీరా లాంటి కుటుంబాలు వ్యక్తుల్ని మోసం చేయవచ్చేమోగానీ ఆత్మ దేవుని మోసం చేయలేరు. సంఘ, సహవాస కమిటీలలో, ఏసియం, ఏజియంలలో సత్యము కంటే మనుషుల ను పైన పెట్టి వారి కోసం రాజీపడే తప్పుడు ఐక్యత కూడా మోసమే.

ఐక్యతను ఫణంగా పెట్టి ఇలా కనిపించి, కనిపించని అడ్డుగోడలు కట్టుకొంటే లోకానికి, విశ్వాసులకు తేడా ఏమీ లేదు సరికదా సువార్త ప్రకటన, సువార్త విశ్వసనీయత, శిష్యరికం నిర్వీర్యమై, ప్రేషితము శూన్యమై, దేవునికి అవమానం తెస్తాయి.

## ముగింపు

అందుకే ఐక్యతను చెరిపే మన పాపాలకు మనం చచ్చిపోదాం. ఇతరుల పాపాలను ప్రేమతో భరిద్దాం. మంచిదారికి తీసుకొద్దాం. ఈ ప్రక్రియలో మనం రిఫైన్ చేయబడతాం. సహోదరుల ఐక్యత ఎంతో మేలు, మనోహరము, దేవునికి మహిమ, కీర్తి తెస్తుంది. అక్కడ ఆశీర్వాదము, శాశ్వత జీవము ఉంటుంది. విశ్వాసులకు ఉజ్జీవము, ఎంతో ఉపశమనం ఉంటుంది. గనుక ఎంత కష్టమైనా వదిలిపెట్టకుండా దేవుని ప్రేమతో, మనసుతో ఐక్యతను కాపాడుకొందాము. కలిసి మెలసి ఉందాము.

**- బి. రంగనాథం, రత్నా గ్రేస్,** వైజాగ్



# రండి! కలసి పోరాడదాం!

దేవుని వాక్యంలో విశ్వాస జీవితం ఒక యుద్ధరంగంతో పోల్చలేదు, ఇది నిజమైన యుద్ధమని, ఆత్మసంబంధమైన యుద్ధమని, పరిశుద్ధ పోరాటమని ఖచ్చితంగా వివరించింది. మారుమనసు పొందిన క్షణం నుండి మనం యుద్ధ భూమిలోనికి ప్రవేశించినట్లు గుర్తించాలి. విజయం మనదేనని ముందుగా ప్రకటించినా, యుద్ధభూమిలో నిలబడి శౌర్యంతో పోరాడడం తప్పనిసరి. దు:ఖకరమైన విషయం ఏంటంటే, యుద్ధంలో నిద్రపోయే వారిని, అనవసరమైన కబుర్లు చెప్పే వారిని, తినవలసినదానికంటే ఎక్కువ తినే ఊబకాయులను, భోజన ప్రియులను, ఆయుధాలు మరచి వచ్చిన వారిని, నాయకుని ఆజ్ఞలకు గౌరవం ఇవ్వని వారిని ఈ ఆత్మీయ యుద్ధంలో తరచుగా చూస్తాము. ప్రభువు రెండవ రాకడ వరకు కొనసాగే ఈ యుద్ధంలో శత్రువు సంసిద్ధుడై మన విశ్వాసాన్ని కొల్లగొట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తుండగా, వయస్సుతో నిమిత్తం లేకుండా 24 గం॥లు మెళకువగా ఉండాలని దేవునివాక్యం ఘోషిస్తుండగా నిర్లక్ష్యం, సోమరితనం దరిచేరకుండా తమను తాము కాపాడుకొంటూ తోటి సైనికులను అప్రమత్తం చేసే ధీరులు కొరవడిన దినాలలో మనమున్నామని గుర్తించాలి.

మన పితరులు యుఇయస్ఐలో ఈ పోరాటాన్ని గూర్చిన దర్శనం పొంది, భావి భారతదేశాన్ని ప్రభువు కొరకు గెలవడానికి సాధ్యపరచే అతి ప్రాముఖ్యమైన సమూహం నిర్లక్ష్యం కావడం గుర్తించి, కాలేజి, విశ్వవిద్యాలయ విద్యార్థులను ప్రభువు సైనికులుగా నిలబెట్టి, తర్ఫీదు ఇచ్చి కాకలు తీరిన ఆత్మీయ పోరాట యోధులుగా తీర్చి దిద్దడం ఒకటే మార్గమని నిర్ధారించారు. దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధంచేసి యుద్ధం ప్రారంభించినప్పటికే వారి సమయం అయిపోయింది. వారు ఈ గురుతర బాధ్యతను తమ తర్వాత తరానికి అందించి వారిని దేవుని కొరకు పోరాట స్ఫూర్తితో నింపారు. ఈ రెండవతరం యోధులు అనేక ప్రాంతాలలో ప్రారంభదాడులు నిర్వహించి ఎన్నడూ ప్రవేశించని అనేక విశ్వవిద్యాలయాలలోనికి చొచ్చుకొని వెళ్ళగలిగారు. ఆ తర్వాత వచ్చిన మూడవ తరం యోధులు ఈ బాధ్యతను తమ భుజస్కంధాల పైకి ఎత్తుకొని అలుపెరుగని పోరాటం చేసి అనేక పయినీరింగ్ స్థలాలను స్వాధీనం చేసుకొన్నారు. రెండవ తరం సైనికులు తెరిచిన ద్వారాలే ఆ తర్వాత వచ్చిన మూడవతరం వారికి గొప్ప అవకాశాలుగా మారాయి. మారుమూల గ్రామాలకు పోరాటం విస్తరించింది. విడిపించబడిన వారనేకులు తిరిగి పోరాటంలో నాల్గవతరం భాగస్వాములయ్యారు. ఇక్కడే పోరాట స్ఫూర్తిలో ఎన్నో సమస్యలు వచ్చాయి. శత్రువు పక్కా ప్రణాళికతో లోనికి చొచ్చుకుని వచ్చాడు. ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో గురుగులు చల్లాడు. నకిలీ సైనికులు, నకిలీ ఆయుధాలు, నకిలీ పోరాటం దేవుని ప్రణాళికను, పోరాట

పురోగతిని దెబ్బతీశాయి. అక్కడక్కడ సైనిక విలువలు పడిపోయాయి. జాగరూకతకు, క్రమశిక్షణకు బదులు శత్రువులతో రాజీపడిన వదంతులు వినవచ్చాయి. జాతీయస్థాయి నాయకత్వంలో అక్కడక్కడ లొసుగులు కనిపించాయి. శత్రువు తన సమయం తక్కువని తెలిసి విభజనలు, గ్రూపిజం ప్రోత్సహిస్తూ అంతర్గత విభేదాలకు, విద్వేషాలకు తెరతీసి పితరుల దర్శనం నుండి దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఈ పరిస్థితులలో ప్రభువు యోధులకు అంత:దర్శనం చాలా అవసరమైన ప్రక్రియ. ఏది నకిలీ, ఏది వాస్తవమో కనిపెట్టవలసిన అక్కర, అసలు సిసలైన యుద్ధ పథకం అమలు పరచాల్సిన సమయం వచ్చింది. ఇక జాప్యానికి అర్థం లేదు. నత్తనడకకు చరమగీతం పాడాలి. మహాఘనుడు, భయంకరుడునగు యెహోవాను జ్ఞాపకం చేసికొని మీ సహోదరుల పక్షంగాను, మీ కుమార్తెల పక్షంగాను, మీ కుమారుల పక్షంగాను, మీ భార్యల పక్షంగాను మీ నివాసము మీకుండునట్లు యుద్ధము చేయండి అని నెహెమ్యా (4:14) పలికినట్లు యుద్ధభేరి మోగించాల్సిన సమయం ఆసన్నమైంది. ఏ మాత్రం నిర్లిప్తత, ఆలస్యవైఖరి కనబరిస్తే సంపాదించుకొన్న భూభాగం వాడు తిరిగి కైవసం చేసుకొనే పరిస్థితి కలుగుతుంది. నడుము బిగించి, ప్రభువు వైపు చూస్తూ ఆత్మీయసంబంధమైన యుద్ధోపకరణములతో, సర్వాంగ కవచము ధరించి శత్రువును ఢీకొందాం!

చరిత్ర మన పక్షంగా మాట్లాడుతుంది. 1954 లో స్థాపించబడి మూడు బైబిల్‌స్టడీ గుంపులతో ప్రారంభమై ఈనాడు భారతదేశమంతట యూనివర్శిటీలలో, కాలేజీలలో క్రీస్తు ప్రభువు రాజ్యాన్ని వ్యాపింపచేయడం మానవాతీత శక్తి వల్లనే సాధ్యమని ఒప్పుకొనక తప్పదు. 12 మంది పామరులతో ప్రారంభించి లోకాన్ని తల్లక్రిందులు చేసి ఐదు ఖండాల్లో కోట్లకొలది సైనికుల మనసులను గెలుచుకొన్న ఘనచరిత్ర మన ప్రభువుది. నిరుత్సాహానికి నిర్లిప్తతకు తావులేని స్ఫూర్తి నింపే ఘనుల జీవితాలు సాక్షి సమూహాలుగా మనముందున్నాయి. ఆత్మదేవుని సహాయం, నడిపింపు అడిగిన వారికి కాదనకుండా ఇచ్చే ప్రభువు ఎప్పుడూ సంసిద్ధుడే! ఆయనకు సాధ్యం కానిది ఏదీ లేదు. పాతాళలోక ద్వారాలు దాని ఎదుట నిలువలేవు అని తన సంఘం గురించి చేసిన వాగ్దానం నూటికి నూరుశాతం సత్యం. ఆయన మాటలే మనకు ఆజ్ఞలు, ఆయుధాలు.

**ఇప్పటిదాకా ఆంధ్రప్రదేశ్‌లో సువార్తకు తీవ్రమైన అవరోధం ఎదురు కాలేదు. కానీ ఇకముందు ఈ పరిస్థితి కొనసాగుతుందన్న నమ్మకం లేదు. కారుమబ్బుల్లా క్రైస్తవ వ్యతిరేక శక్తులు ముసురుకోవడం చూస్తున్నాము. ప్రభువు రాకడ సమీపిస్తుండగా మరింత అప్రమత్తతతో శరీరం లోపలి శత్రువుతోను, శరీరం బయట శత్రువులతోను ఆత్మీయ పోరాటం చేద్దాం.**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి విద్యార్థి కనీసం ఒక్కసారైనా క్రీస్తు ప్రభుని ప్రేమ గురించి వివరంగా విని జ్ఞానయుక్తంగా, స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకోవడానికి అవకాశం కలిగించడం ప్రతి విశ్వాస సైనికుని విధి. వారిని సాతాను ఉచ్చులో చిక్కుకొన్న నిస్సహాయ బంధీలుగా చూడలేకపోవడానికి వాడు మన కళ్ళకు వేసిన గంతలు, మన మనో నేత్రాలకు అనుగుణంగా మార్చడానికి పన్నిన "వలలే" కారణం. మన యువ సైనికులను వారి భావి సేవా జీవితాన్ని కొల్లగొట్టడానికి వాడు వేసే భారీ పథకంలో వారి వివాహం ప్రధాన విషయం. ఆ వివాహ ఎంపికలో వారిని దేవుని ఇష్టానికి వ్యతిరేకంగా ఆలోచింపజేసి వారి జీవితాలను శోకసముద్రంగా మార్చి వారి ఏకత్వాన్ని భగ్నం చేయడానికి సాతాను వేసే పన్నాగాలను ధాటిగా ఎదుర్కోవాలంటే వివాహానికి వారు ఎలా సిద్ధపడాలో తర్ఫీదు ఇవ్వాలి. వివాహం చేసుకొన్నవారి మనసులను శత్రువు యుద్ధం మీద నుండి జీవన వ్యాపారాల్లోకి మరల్చి, ప్రక్కదారి పట్టించి యుద్ధభూమిలో చూపాల్సిన పౌరుషం, సాహసం చూపకుండా నిర్వీర్యులుగా చేయడానికి వాడు వేసే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయవలసి ఉంది.

ప్రతి గ్రాడ్యుయేట్, విద్యార్థి యుద్ధం చేయాలి,

రండి కలసి పోరాడుదాం. దుష్టునికి సంబంధించిన ప్రతి దానిని మన సహవాసాల్లోనుండి, మన నివాసాల్లోనుండి, మన మనస్సుల్లోనుండి తరిమేద్దాం, బయట పారవేద్దాం. దేవుని రాజ్య విస్తరణ పోరాటంలో పాలు పంచుకుందాం. పరిశుద్ధ పోరాటం, ప్రార్థన పోరాటంతో ఆక్రమిత భూభాగం నుండి శత్రువుని పదవీ భ్రష్టున్ని చేద్దాం.

చేస్తూనే ఉండాలి. ఇది ఆగిపోని యుద్ధం. ప్రభువు రెండవసారి ప్రత్యక్షం అయ్యేవరకు కొనసాగుతూనే ఉంటుంది. ప్రాచీన పురుషునితో, లోక వ్యవస్థతో, సాతానుతో ఈ పరిశుద్ధ పోరాటం కొనసాగుతుంది. ఈ ముగ్గురు శత్రువులు మనకంటె బలవంతులు, అనుభవజ్ఞులు కూడా. అయినప్పటికీ వారిపై మనకు విజయాన్నివ్వడానికి మన ప్రభువు జరిగించిన అద్భుత సిలువ మరణం, పునరుత్థాన యుగళ విజయం మన  లను మన శత్రువుకంటె ఎంతో ఉన్నతస్థానంలో ఉంచింది. శత్రువు మనలను భయపెట్టడానికి ఉపయోగించే మరణాన్ని ప్రభువు కొట్టివేశాడు. వాడు మనపై నేరస్థాపన చేయడానికి సహాయం చేసే ధర్మశాస్త్రాన్ని ఎత్తివేశాడు. మన మనసులను నియంత్రించే ప్రాచీన పురుషుని బలాన్ని సిలువలో నిరర్థకం చేశాడు. తనతో విశ్వాసిని ఐక్యపరచుకొని పరలోకస్వాస్థ్యాన్ని రాసి ఇచ్చాడు. అనుదిన జీవితంలో మనకు నైతిక మార్గాన్ని నిర్దేశించడానికి ఆయన మాటలను గ్రంథరూపంలో మన చేతిలో పెట్టాడు. క్షణక్షణం మనలను నడిపించడానికి పరిశుద్ధాత్మ దేవునిని మన దేహంలో నివాసముంచాడు. ఇంతకంటే ఆయన ఏమి చేయాలి? విజయం మనది కాక ఇంకెవరిది? ఆయన మన పక్షమందుండగా విరోధి ఏమి చెయ్యగలడు? నీవు నేను ఆయన పక్షాన, ఆయన ప్రతినిధులుగా, ఆయనపై ఆధారపడి, ఆయన జీవంతో పోరాడడమే విజయం.

ప్రార్థన అనేది పరిశుద్ధ పోరాటంలో సైనికుడు ఆయన శక్తిపై ఆధారపడుతూ చేసే ఒక పవిత్ర యుద్ధం. పవిత్రమైన మనసుతో ప్రార్థించే చేతులకు ఆయన యుద్ధం నేర్పిస్తాడు. సాతానుడు మనుష్యుల మనసులలో నిర్మించిన దుర్గాలను పడగొట్టి వాడిని స్థాన భ్రష్టున్ని చేయడానికున్న ఒకే మార్గం ప్రార్థన. ఈ గొప్ప ఆయుధాన్ని సాధన ద్వారా మరింత వాడిగా, చాతుర్యంగా వాడగలం.

పరిచర్యను చాలా సౌఖ్యంగా చేయడానికి ఇష్టపడే దినాల్లో మనమున్నాము. మన చేతులు కందిపోకూడదు. కాళ్ళు మురికి కాకూడదు, మనసు గాయపడకూడదు, దేహం అలసిపోకూడదు అని అనుకుంటే అది యుద్ధం కాదు. సువార్త శిబిరాలు, శిష్యరిక క్యాంపులు పిక్నిక్‌లు కాదు. ఇక్కడ యుద్ధం గురించి మాట్లాడాలి, యుద్ధం నేర్పించాలి, యుద్ధం చేసేవాళ్ళే మాట్లాడాలి. ఎప్పుడో తయారుచేసుకున్న నోట్స్‌లు, సందేశాలు ఇప్పటి యుద్ధానికి పనికిరాకపోవచ్చు. కాలంతో పాటు, తరంతోపాటు పథకం మారాలి. యుద్ధంలో కత్తికి ఎప్పటికప్పుడు పదును పెట్టుకోవాలి కదా! సైనికుని అప్రమత్తత, క్రమశిక్షణ అందులో కనబడుతుంది.

ఇప్పటిదాకా ఆంధ్రప్రదేశ్‌లో సువార్తకు తీవ్రమైన అవరోధం ఎదురు కాలేదు. కానీ ఇకముందు ఈ పరిస్థితి కొనసాగుతుందన్న నమ్మకం లేదు. కారుమబ్బుల్లా క్రైస్తవ వ్యతిరేక శక్తులు ముసురుకోవడం చూస్తున్నాము. ప్రభువు రాకడ సమీపిస్తుండగా మరింత అప్రమత్తతతో శరీరం లోపలి శత్రువుతోను, శరీరం బయట శత్రువులతోను ఆత్మీయ పోరాటం చేద్దాం.

మనసు నిండుగా దేవుని సత్యముంటే, హృదయంలో ఆయన కొరకు పనిచేయడానికి, యుద్ధం చేయడానికి ఆతురతవుంటుంది. కల్తీలేని ప్రేమ ప్రాణత్యాగానికైన సంసిద్ధత వ్యక్తపరుస్తుంది. ప్రార్థన మన ఊపిరైతే విజయం మనసొత్తు అవుతుంది. పరిశుద్ధ జీవితంలోనుండి వచ్చే ప్రార్థన దుష్టుణ్ణి స్థాన భ్రష్టున్నిచేసి వాని భూభాగాన్ని దేవుని కొరకు సంపాదించడానికి ద్వారాలు తెరుస్తుంది.

రండి కలసి పోరాడుదాం. దుష్టునికి సంబంధించిన ప్రతి దానిని మన సహవాసాల్లోనుండి, మన నివాసాల్లోనుండి, మన మనస్సుల్లోనుండి తరిమేద్దాం, బయట పారవేద్దాం. దేవుని రాజ్య విస్తరణ పోరాటంలో పాలు పంచుకొందాం. పరిశుద్ధ పోరాటం, ప్రార్థన పోరాటంతో ఆక్రమిత భూభాగం నుండి శత్రువుని పదవీ భ్రష్టున్ని చేద్దాం.

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు
ట్రైకాన్ 2017 కీనోట్



ప్రత్యేకం

# కలిసి జీవిద్దాం
# కలిసి పని చేద్దాం

మార్క్ ట్వైన్ ఒకసారి ప్రయోగాత్మకంగా ఒక కుక్క, పిల్లిని ఒక బోనులో ఉంచితే అవి రెండూ కలిసి ఉన్నాయట. తర్వాత అతను ఒక పక్షి, పంది, మేకను ఉంచాడట. అవి కూడా కొన్ని సర్దుబాట్ల తర్వాత బాగానే కలిసి ఉన్నాయట. తర్వాత అతను వివిధ సంఘాల వ్యక్తులను ఒక రూమ్‌లో ఉంచాడట. కొద్దిసేపటికే అక్కడ ఎవ్వరూ మిగలలేదట. వ్యక్తులు, విశ్వాసులు కలిసి మెలసి ఉండడం, సర్దుబాట్లు చేసుకోవడం ఎంత కష్టమో మనకు అర్థమవుతుంది.

"ఐక్యత సహవాసానికి ప్రాణము" అని రిక్‌వారెన్ అంటాడు. 'యూనిటీ' అనగానే వివిధ భాగాలు, వ్యక్తులు కలిసి ఉండడం, పని చేయడం అని అర్థం. 'ఐక్యతతో కలిసి పని చేయుడం' అనేది మన పరిచర్యలో అత్యంత అవసరం. అంత అవసరమైన విషయాన్ని తప్పక ఆలోచించాలి.

ఐక్యత అనగా ఒకేలా ఉండడం, పని చేయడం, ఒకే కప్పు కింద చేరడం, సభ్యత్వం కలిగి ఉండడం, సంఖ్యాపరమైన అభివృద్ధి అసలే కాదు. ఐక్యతను మనం సరిగా తెలుసుకోవాలంటే, త్రిత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి. దైవత్వంలో ముగ్గురు ఉన్నప్పటికీ ఒక్క దేవుడుగానే ఉన్నాడు. ఈ సత్యం నుండి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఒకటి ఉన్నది. అదే ఐక్యత. అది ఆయన లక్షణం. ఈ లక్షణాన్ని అంటే మనలో భిన్నత్వం ఉన్నప్పటికీ ఒక్కటిగా ఉండే లక్షణాన్ని ఆయన మన నుంచి కోరుతున్నాడు.

దేవుని బిడ్డల మధ్య ఉండాల్సిన ఐక్యతను తెలపడానికి పౌలు ఈ క్రింది పోలికలను తెలియజేశాడు.

### 1. ఐక్యత ఒక నిర్మాణము (ఎఫె 2:22, 1పేతు 2:5)

క్రీస్తు సిలువ మనుష్యుల మధ్యలో ఉన్న భేదాలను తొలగించి ఐక్యపరిచింది. సజీవరాళ్ళ వలె దేవుని మందిరంగా మనలను పరిశుద్ధాత్ముడు నిర్మిస్తున్నాడు. రాళ్ళ మీద రాళ్ళు, ఇటుక మీద ఇటుక పేర్చడం కాదు గానీ, సిమెంటుతో నిర్మించడం అని గ్రహించాలి. ఇక వేరవడం కుదరదు.

### 2. ఐక్యత ఒక బంధము (ఎఫె 4:1)

పరిశుద్ధాత్మ దేవుడు మనలను ఐక్యతతో బంధించుచుండగా, దానిని శ్రద్ధతో మనం కాపాడుకోవాలి. ఈ శ్రద్ధ ఎన్నో సర్దుబాట్లతో కూడుకొన్నది. మొండి వైఖరి, ఇతరులను అర్థం చేసుకోలేని పరిస్థితి, అంగీకరించలేని, క్షమించలేని కాఠిన్యాల నుంచి బయటపడాలి. అయితే పాపముతో రాజీపడడం ఐక్యతా బంధమును కాపాడుకోవడం కాదు.

### 3. ఐక్యత ఒక శరీరము (1 కొరి 12:12-31)

ఒకే శరీరములోని అనేక అవయవములవలె కలిసి ఉండుట.

**అ) భిన్నత్వములో ఏకత్వము (12-14):** వేరు వేరు అవయవములు ఒకే శరీరములో కలిసియున్నట్లుగా వివిధ నేపథ్యాలు, విలువలు, పెంపకాలు, వ్యక్తిత్వాలకు చెందిన మనం క్రీస్తు శరీరంలోని భాగాలమైయున్నాము. మన భేదములన్నిటిని వదిలి ప్రభువు ప్రధాన యాజకత్వపు ప్రార్థనలో కోరినరీతిగా ఏకత్వంతో ముందుకు సాగుదాం.

**ఆ) ఒకరిపై ఒకరు ఆధారపడడం (15-21):** దేవుడు మనలను సృజించినది, ముఖ్యంగా

రక్షించింది ఒంటరిగా ఉండడానికి కాదు. ఒకరి విశ్వాసం ద్వారా ఒకరు బలపడడానికి, ఆదరణ, హెచ్చరికలు పొందటానికి, పరిచర్యలో పురికొల్ప బడడానికి సంఘాన్ని, సహవాసాన్ని దేవుడిచ్చాడు. చాలాసార్లు మన బలహీనతలు మనకు తెలియవు. ఒక కొవ్వొత్తి వెలుగుతూ ఉంటే దాని వెనుకనున్న చీకటి (నీడ) పోవాలంటే మరొక కొవ్వొత్తి అవసరం. ఆలాగే చాలా కొవ్వొత్తులు కలిసి అక్కడున్న చీకటిని పోగొట్టగలవు. ఎంత పెద్దవారైనా, అనుభవజ్ఞులైనా, జ్ఞానవంతులైనా ఒంటరిగా పరిపూర్ణులు కాలేరు. క్రీస్తు ప్రేమ పొడుగు, వెడల్పు, లోతు, ఎత్తును గ్రహించాలంటే సహవాసం కావాలి. మెస్సీయను పూర్ణముగా లోకానికి చూపడానికి నాలుగు సువార్తలు అవసరమయ్యాయి.

**ఇ) ప్రతి భాగము ప్రాముఖ్యమైనదే (22-25):** సహవాసంలో ప్రతి వ్యక్తి అవసరమే. ప్రతి అవయవమునకు ప్రత్యేకమైన పని ఉన్నట్లే, ప్రతి వారి కి దేవుడు సత్క్రియలను సిద్ధపరిచాడు (ఎఫె 2:10). వారి వారి భాగాలను అందరూ నెరవేరుస్తుంటే, దేవుని పరిచర్య ఫలవంతమై, ఆయనకు మహిమ కలుగుతుంది.

**ఈ) పరస్పర ప్రేమ (26):** ఇతరుల యొక్క ఆనందాల్లో పాలుపొందాలే గాని అసూయ పడకూడదు. దు:ఖములలో ఉన్నవారిని ఆదరించి ధైర్యపరచాలే గాని వారి కష్టాలు మనకు సంతోషాన్ని కలిగించకూడదు.

## 4. ఐక్యతను పాడు చేసేవి

ఐక్యతలో ఉన్న ఔన్నత్యం, బలము సాతానుకు బాగా తెలుసు. మొదటి శతాబ్దంలో సంఘాన్ని వెలుపలి నుంచి హింసించినవాడు ఓటమితో తన ప్రణాళికను మార్చుకొని, ప్రభువు బిడ్డల ఐక్యతపై దాడిచేస్తూ విజయం సాధిస్తున్నాడు. అందువలన ఐక్యతను పాడుచేసే సాతాను సాధనాలను మనం గుర్తించాలి.

**1. పరిష్కరింపని వివాదాలు:** మనం భిన్న వ్యక్తిత్వాలకు చెందిన వారం గనుక, సహవాసంలో వివాదాలు రాక తప్పవు. అయితే వాటిని ఏ రీతిగా పరిష్కరించుకొంటున్నామో అనే దాని మీదే మన పరిపక్వత, ఆత్మీయత ఆధారపడి ఉంటాయి. కొన్నిసార్లు అతిచిన్న భేదాలు ఎంతో ఘోరమైన పరిస్థితులకు దారితీస్తాయి. అవి పెరగకుండా వీలైనంత త్వరలో పరిష్కరించుకోవాలి.

**2. స్వార్థము:** మన పాత స్వభావములో ముఖ్యమైనది స్వార్థము. తనను గూర్చి తాను శ్రద్ధ తీసుకోవడంలో తప్పులేదు గానీ, తన కోసమే తాను బతకడం క్రైస్తవ్యం కాదు. మరికొంతమంది ఇతరులకెంత కష్టమైనా, నష్టమైనా తమకు లాభం, ఆనందం కలిగితే చాలనుకుంటారు. ఇది మన సహవాసాల్లో కూడా అక్కడక్కడా కనబడుతుంది. నాకు సహవాసం ఏమిస్తుంది అనేదాని కన్నా నేను సహవాసానికి ఏమి ఇవ్వగలుగుతున్నాను? అనేది ప్రాముఖ్యం. స్వార్థము ఐక్యతకు గొడ్డలిపెట్టు.

**3. అసూయ, ద్వేషాలు:** దేవుడు ఇతరులను దీవించినప్పుడు మనం దేవునిని హృదయపూర్వకంగా స్తుతించలేకపోతే అసూయ మొదలైనట్లే. మనకంటె ఒకరిని దేవుడు బాగా వాడుకొంటే, మనకంటే మంచి సలహాలు వేరొకరు ఇస్తే మనకు నిజమైన ఆనందం కలగకపోతే ద్వేషం చిన్నగా మనలో ప్రారంభమైనట్లే. ద్వేషం నరహత్యతో సమానమని మన ప్రభువే చెప్పారు. ప్రభువు బిడ్డలుగా శారీరక హత్యలు చేయకపోయినా, చెడ్డ ప్రచారాలు చేస్తారు. ఇది కూడా ఒకరకమైన హత్యే.

**4. నిందలు, నిష్టూరాలు:** ఎప్పుడూ ఇతరులలో ఏ మంచి చూడలేని వారు కొంతమంది ఉన్నారు. ప్రతి చిన్న పొరపాటును కొండంత చేసి చూపిస్తారు. సైతానుతో పోరాడడానికి బదులు మనుష్యులతోనే పోరాడతారు. ప్రేమ లేకపోగా వారు చెప్పే మాటల్లో ఎన్నో అతిశయోక్తి అలంకారాలు నిండి ఉంటాయి. ఇది ఐక్యతను ఎలా కాపాడుతుంది?

**5. కోపము:** సహజంగా కోపము పాపము కాదు గానీ, పాపంలో ప్రవేశానికి ఎప్పుడూ అనుకూలమైనదే. పాపముపై కోపపడవచ్చు గాని, పాపిపై కోపపడితే అది అతి త్వరగానే తగ్గాలి. సమకూర్చడంపై మనసు పెట్టాలి. హెచ్చరించుట, ఆదరించుట కలసి వెళ్ళాలి. అప్పుడే కోపము సరిహద్దులలో ఉంటుంది. లేకపోతే నష్టమే.

## 5. ఐక్యతను కలిగించేవి

ఐక్యతను పాడు చేసేవి లేకుండా చూసుకోవడం మాత్రమే కాదు గానీ, ఐక్యతను కాపాడుతూ, అభివృద్ధిపరచే వాటివైపు కూడా మనం శ్రద్ధ చూపాలి.

**చాలాసార్లు మన బలహీనతలు మనకు తెలియవు. ఒక కొవ్వొత్తి వెలుగుతూ ఉంటే దాని వెనుకనున్న చీకటి (నీడ) పోవాలంటే మరొక కొవ్వొత్తి అవసరం. ఆలాగే చాలా కొవ్వొత్తులు కలిసి అక్కడున్న చీకటిని పోగొట్టగలవు. ఎంత పెద్దవారైనా, అనుభవజ్ఞులైనా, జ్ఞానవంతులైనా ఒంటరిగా పరిపూర్ణులు కాలేరు. క్రీస్తు ప్రేమ పొడుగు, వెడల్పు, లోతు, ఎత్తును గ్రహించాలంటే సహవాసం కావాలి. మెస్సీయను పూర్ణముగా లోకానికి చూపడానికి నాలుగు సువార్తలు అవసరమయ్యాయి.**

**1. సమాధానము:** భేదాలు, భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు గాని వాటిని పరిష్కరించుకోవడానికి త్వరపడాలి. అవి పరిష్కరించుకొనే శ్రద్ధ ఇరుపక్షాల్లోను కావాలి. చొరవ తీసుకోవడానికి త్వరపడాలి. ఎవరి తప్పును వారు గ్రహించడంలో, ఎదుటి వారిని అర్థం చేసుకోవడంలో యథార్థతను కనపరచాలి. వివాదము రాకముందు ఉన్న సంబంధం కంటె, పరిష్కారమైన తర్వాత మరింత గాఢమైన సంబంధం కలిగినప్పుడే అది నిజమైన సమాధానమవుతుంది.

**2. ప్రేమానుబంధాలు:** మన సహవాసాల్లో ప్రేమ సన్నగిల్లుతున్నట్లుగా కనిపిస్తుంది. మ్రోగెడి కంచు, గణగణలాడు తాళముల శబ్దము ఎక్కువగా వినిపిస్తున్నాయి. అక్రమం విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును (మత్త 24:12) అని వాక్యం సెలవిస్తుండగా మన ప్రేమ తగ్గడానికి కారణాలు వెదుకుదామా? దేవుని వెలుగులో పరీక్షించుకొని పశ్చాత్తాపపడదామా? తాను చూస్తున్న సహోదరుని ప్రేమించలేని వాడు చూడని దేవుని ఎలా ప్రేమించగలడు? (1 యోహా 4:20). మన మొదటి ప్రేమ ఎలా ఉంది? మనం దేవుని ప్రేమిస్తున్నామనుకొంటె, అది సహవాసాల్లో ఎందుకు కనిపించడం లేదు? అలా అయితే మనం చెప్పుకొంటున్న ఐక్యతకు అర్థమేంటి? చాలా విషయాల్లో దేశమంతా యుఇయస్ఐ-ఏపి వైపు చూస్తుంటే, మనలో ప్రేమ తగ్గితే మనం ఏమి చేస్తున్నట్టు?

**3. క్షమించడం, క్షమాపణ పొందడం:** దేవుని క్షమాపణ పొందిన పాపులమైన మనం క్షమాపణ విలువెంతో గ్రహించామా? మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రాణమంత గదా. అయితే మనం క్షమించలేని వారెవరైనా ఉన్నారా? మత్త 18:21-35లోని ఉపమానాన్ని మరలా ఒకసారి ధ్యానించండి. సహవాసాల్లో ఉన్న అనేకమైన సమస్యలు, మన శరీరములో, మనసులో ఉన్న అనేక రుగ్మతలు, క్షమించలేని మన స్వభావం వలనే అని వాక్యము, మనస్తత్వ వైద్యులు చెప్తున్నారు. క్షమించలేని కఠిన స్థితిని తీసివేయమని దేవునిని అడుగుదాం.

**4. ప్రేమ గలిగి సత్యము చెప్పడం:** 'సత్యము' అనే ఎముకల గూడుకు, రక్తమాంసాలు కలిస్తేనే పూర్ణమైన శరీరము కలుగుతుందని పి.సి. వర్గీస్ గారు చెప్తారు. మన ప్రభువు కృపాసత్యసంపూర్ణుడు (యోహా 1:14) అని జ్ఞాపకము చేసుకొంటె మనకు ఎంతో ఆదరణ గదా. మనం కూడా ఈ విషయంలో ఒకవైపు మొగ్గకుండా ఆయనను అనుసరిద్దాం? సత్యము చెప్పడానికి భయపడక, ప్రేమించడానికి వెనుకాడక సమపాళ్ళలో రెండింటిని కలిగియుండడానికి ఎంతో ప్రార్థన, ప్రయాస కావాలి.

## 6. ఐక్యతతో పనిచేయడం

ఇంత శ్రేష్ఠమైన ఐక్యతను కలిగియుంటే మనం ఎంతో ప్రభావంతో పనిచేయగలం అని తెలుసుకోవాలి. నెహెమ్యా పనిలోను, దానియేలు పరిచర్యలోను, ఆది సంఘస్తుల టీమ్‌వర్క్‌లోను మనం స్పష్టంగా చూడగలం. అందుకనే వారి మాదిరిని నేర్చుకొందాం.

## 7. ఐక్యత గురించిన విషయాలను ధ్యానిద్దాం

- ప్రార్థనలో ఐక్యత - అ.కా 4:29-31, మత్త 18:19,20, దాని 2:17,18
- సహవాసంలో ఐక్యత - అ.కా 2:42, ఎఫె 2:22, 4:1-7
- సాక్ష్యమిచ్చుటలో ఐక్యత - అ.కా. 3:15,11-26; దాని 3:16-18
- సర్దుబాట్లు చేసుకోవడంలో ఐక్యత - అ.కా 15:22-29
- కలసి పనిచేయడంలో ఐక్యత - నెహె 2:17-18; 3:1-32

**- విజే డెస్క్**

బైబిల్ స్టడీ



# ఐకమత్యమే బలం

ఎఫెసీ 4 :1-16

**పరిచయం**

ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు గోడల ఇటుకలలో సిమెంట్ సరిగా అతుక్కునేలా పూద్చుతారు. లేకపోతే అవి కొంతకాలానికి కదిలి గోడలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఐక్యత కూడా అలాంటిదే. ఒక కుటుంబం, వ్యవస్థ, సమాజం, ఉద్యమం, సహవాసం, సంఘానికి ఏకత్వం అనేది సంఘటితంగా ఉంచుతుంది. దేవుడు యేసుక్రీస్తులో కొత్త సమాజాన్ని ఏర్పరచినప్పుడు వ్యక్తులు ఎటువంటి నేపథ్యాలకు, స్థాయి, స్థానాలకు చెందినా సహవాసంలో ఒకే దేవుని, ఒకే దేవుని కుటుంబంగా జీవించాలని ఆశించాడు.ఆ పిలుపును దృష్టిలో పెట్టుకొని పౌలు పిలవబడిన పిలుపుకు తగినట్టుగా జీవించాలని ఈ భాగంలో హెచ్చరించడం జరిగింది. ఆది సంఘంలో వ్యక్తిగతంగా, సాముహికంగా అన్ని భాగాలలో ప్రతిబింబించాలని ఆశపడ్డాడు.

ఏకత్వం అంటే అందరూ ఒకేలా ఆలోచించడం, మాట్లాడడం, పని చేయడం, ఒకే అభిప్రాయాలు, సామర్థ్యాలు, బలహీనతలు, స్పందనలు కలిగి ఉండడం కాదు. సహవాస సంబంధాలు సజీవంగా ఉండాలంటే భిన్నత్వం ఎంతైనా అవసరం.ఏకత్వానికి ఆధారం త్రిత్వంలోని ఏకత్వం అని ఈ భాగం ఉద్ఘాటించింది.మన సహవాసంలోని సామాన్య జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి ఈ విభిన్న వరాలు మన భిన్నత్వాన్ని వ్యక్తం చేస్తాయి.ఐక్యతా భావం విశ్వాసులలో నెలకొన్నప్పుడే ఆధ్యాత్మిక పరిణతి గుర్తులు కనిపిస్తాయి.ఇది యాధృచ్ఛికంగా కలిగేది కాదు.అందరూ స్పృహతో పెంపొందించుకోవడానికి ప్రయత్నించినప్పుడే ఇది వాస్తవ రూపాన్ని దాల్చు తుంది. దీనిలో ఎదిగే వాళ్ళు సత్యానికి, అసత్యానికి మధ్య వ్యత్యాసాన్ని చూడగలిగి, ప్రేమా, సత్యం వ్యక్తం చేసే జీవన శైలిని జీవిస్తారు.

**ప్రశ్నలు**

1. మీ అభిప్రాయం మంచిదని మీరు భావించిన తరుణంలో అవతలి వ్యక్తి దానిని ఆమోదించకపోతే మీలో ఎలాంటి భావనలు కలుగుతాయి ? మీరు అవతలి వ్యక్తి స్థానంలో ఉంటే ఎలా స్పందిస్తారు ?
2. పౌలు ఎఫెసీ సంఘంలో ఏ అవసరతను గుర్తించి దాని కోసం దృఢ ప్రయత్నం చేయాలని కోరుతున్నాడు?1 వ
3. దేవుని ప్రజలు ఏ గుణాలను కలిగి జీవించడం ద్వారా దైవ పిలుపుకు అనుగుణంగా జీవించ గలరు? వాటిని వివరించుము (1-3 వ)
4. ఈ గుణాలు సహవాసంలో ఏకత్వం పెంపొందించడానికి ఎలా సహాయ పడగలవు? నీ వ్యక్తిగత, పరిచర్య జీవితంలో ఈ లక్షణాలలో వేటిని ఇంకా నీవు సాధకం, అభివృద్ధి చేయాల్సిన అవసరత ఉంది?
5. త్రిత్వంలోని ఏకత్వం, సంబంధాల మధ్య ఏకత్వాన్ని ఎలా ప్రభావితం చేసి, పెంపొందింప చేస్తుంది? 4-6 వ .

   అదే సమయంలో దేవుడు భిన్నత్వాన్ని ఈ విధానంలో కల్పించడానికి కారణం ఏమిటి? 11-13
6. విభిన్న ఆత్మ వరాలు సహవాసం, ఐక్యత కలిగి, ఆధ్యాత్మిక పరిపక్వత చెందడానికి ఎలా సహాయపడతాయి?12 వ.

   నీ వరాలలో వేటి ద్వారా సహవాసంలో విశ్వాసులు ఆధ్యాత్మిక పరిపక్వత లోనికి ఎదగడానికి సహాయపడుతున్నావు?
7. 13-16 వచనాల ప్రకారం సహవాసం అంతిమ లక్ష్యం ఏంటి? సహవాస ఏకత్వంను, ఆధ్యాత్మిక పరిపక్వతను వేటి ద్వారా పెంపొందించుకోవాలి?
8. ఏకత్వం, ఆధ్యాత్మిక పరిపక్వత లేమి లక్షణాలు ఏవి ? 14 వ. పరిపక్వత గల సహవాసం దాని లక్షణాలను యే విధానాలలో వ్యక్తం చేస్తుంది ?15 -16

మన సహవాసంలో అనేకులు తమకు ఎటువంటి ఆధ్యాత్మిక వరాలు లేవనే ఆలోచనలో ఉన్నారు. అలా ఆలోచించే వాళ్ళు నీకు తెలిసివుంటే నీవు వాళ్ళలో గమనించిన ఆత్మవరం (లు) గురించి వాళ్ళకు చెప్పి వాళ్ళను పురికొల్పు.

- బి. మంజుల లాజరస్,
నేషనల్ రిటైర్డ్ స్టాఫ్, హైదరాబాద్







# క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలు

"అన్నా మనకు కుడివైపున ఉన్న చర్చ్ వాళ్ళకు, ఎడమ వైపున ఉన్న చర్చ్ వాళ్ళకు మధ్య సఖ్యత లేదు ఎందుకు?" అని రమేష్ అన్నని అడిగాడు ఆదర్శ్. ఆదర్శ్ వేరే విశ్వాసం నుంచి కొన్ని వారాల క్రితం రక్షణ పొందాడు. ఆదర్శ్‌కి అర్థం అయ్యేలా రమేష్ అన్న ఇలా వివరించడం మొదలు పెట్టాడు. తమ్ముడూ ఈ రోజు క్రైస్తవ్యం ఎదుర్కొంటున్న సమస్యలలో ఒక ప్రాముఖ్యమైన సమస్య "సంఘాల మధ్య ఐక్యత లేకపోవడం". దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, సిద్ధాంత పరమైన తేడాలు కూడా ఒక ముఖ్య కారణం. యేసు ప్రభువు వారు యోహాను 17:20-21 లో "... నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమైయుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను.." అని ప్రార్థించారు. కాబట్టి విశ్వాసులందరూ ఏకమై ఉండాలని ప్రభువు కోరిక. ఒక గొప్ప భక్తుడు చాలా కాలం క్రితమే ఇలా అన్నారు. "ప్రాథమికాల్లో (ప్రాథమిక సిద్ధాంతాలలో) ఏకత్వం, ప్రాథమికం కాని వాటిలో స్వేచ్ఛ మరియు అన్నింటిలో ప్రేమ కలిగి ఉండాలి". అనగా, క్రైస్తవులుగా మనం, ప్రాథమిక సిద్ధాంతాలు ఏంటి అని తెలుసుకొని వాటిలో అందరం ఏకీభవించి, ప్రభువుని బట్టి ఐక్యతతో సాగిపోవాలి. ప్రాథమికం కాని వాటిలో స్వేచ్ఛనిచ్చి, అందరి పట్ల ప్రేమతో, కలిసిమెలిసి ప్రపంచానికి సువార్తను అందిస్తూ ప్రభువుని సంతోషపెట్టాలి.

ఉదాహరణకు మూడు వేర్వేరు సంఘాలు ఒకే ఊరిలో ఉన్నప్పుడు, మనం నమ్మేది ఒకటే (ప్రాథమిక సిద్ధాంతాలలో) అని అన్నదమ్ముల్లా కలిసిపోవాలి. "చర్చ్‌లోకి చెప్పులు వేసుకొని రావచ్చా, లేదా" అనేది ప్రాథమికం కాని అంశం. ఒకవేళ ఆ విషయంలో వారి మధ్య భిన్న అభిప్రాయాలున్నా, అది ఆ మూడు సంఘాల ఐక్యతపై కొంచెం కూడా ప్రభావం చూపించ కూడదు. "మీరు తప్పు", "కాదు మీరే తప్పు"... అనే వాదనకు బదులు, భిన్నాభిప్రాయాలున్నా ఫర్వాలేదు అని కలసి కొనసాగాలి, ఎందుకంటే అది ప్రాథమికం కాని అంశం కాబట్టి." ఇలా చెబుతూ టీ పెట్టడం మొదలు పెట్టి సంభాషణను కొనసాగించాడు రమేష్ అన్న.

ఏకత్వానికి పునాది "ప్రాథమిక సిద్ధాంతాలు". గనుక "క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలు ఏవి? వాటి రూప కల్పన ఎలా జరిగింది?" అనేది ఇప్పుడు తెలుసుకుందాం. సంఘ చరిత్రను మనం గమనిస్తే, మొదటి శతాబ్దం నుంచే తప్పుడు బోధలు, తప్పుడు సిద్ధాంతాలు విశ్వాసులను ఇబ్బందులకు




గురిచేశాయి. పౌలు భక్తుడు రాసిన పత్రికలలో వీటిని ఖండిస్తూ సరైన సిద్ధాంతాలను ప్రస్తావించాడు. ఆ తర్వాత రెండవ శతాబ్దంలో సంఘ పెద్దలు కొందరు సమావేశమై, తప్పుడు బోధలను ఖండించడానికి మనం నమ్మే సత్యాన్ని, ప్రాథమిక సిద్ధాంతాలను ఒక స్టేట్ మెంట్/ప్రకటనగా చెప్పాల్సిన అవసరం ఉందని భావించారు. వారు బైబిల్‌లోని బోధను ఆధారం చేసుకొని, "అపోస్తలుల విశ్వాస ప్రమాణము"ను తయారు చేశారు. ఆ తర్వాత కాన్‌స్టాంటైన్ చక్రవర్తి చొరవతో నైసియలో క్రీ.శ. 325లో ప్రపంచం నలుమూలల నుంచి ముఖ్యమైన సంఘ నాయకులు, బిషప్పులు సమావేశమయ్యారు. వారు రూపొందించినదే "నికేయ విశ్వాస ప్రమాణము" (Nicene Creed). దీనిలో క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలను కొన్ని వాక్యాలలో చెప్పడం జరిగింది. క్రీ.శ. 381లో కాన్‌స్టాంట్‌నోపిల్‌లో క్రైస్తవ నాయకులు మరలా సమావేశమై, దీనికి కొన్ని చిన్న మార్పులు చేశారు. ఈరోజుకూ కొన్ని సంఘాలలో ప్రతి ఆదివారం ఈ ప్రమాణాన్ని సంఘ సభ్యులందరూ చదువుతారు. క్రీ.శ.381 తర్వాత కూడా సమావేశాలు జరిగాయి. ప్రమాణాలు రాయబడ్డాయి. కానీ వీటన్నింటికి "నికేయ విశ్వాస ప్రమాణం" పునాది. ఏది ఏమైనా క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలు ఎవరో ఊహించి చెబితే వచ్చినవి కాదు. అవి బైబిల్‌లో నుంచి మాత్రమే తీసుకోబడ్డాయి. రిఫార్మేషన్ సమయంలోనూ, తర్వాతి శతాబ్దాలలో కూడా క్రైస్తవ పెద్దలు, దైవజనులు క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలను కొనసాగిస్తూ వచ్చారు." అని చెబుతూ టీ అందించాడు రమేష్ అన్న.

టీ తాగుతూ ఆదర్శ్ ఇలా అన్నాడు. అన్నా ఇంకో కోణంలో ఆలోచిస్తే, "బైబిల్ చెప్పేదంతా సత్యమే. అందులో అన్నీ ప్రాముఖ్యమైన విషయాలే. మరి అలాంటప్పుడు 'ప్రాథమిక సిద్ధాంతాలు' అని కొన్నిటిని మిగతా వాటికంటే ఎక్కువ చేసి చెప్పడం సమంజసమా?" రమేష్ అన్న వెంటనే అందుకొని ఇది సరైన ఆలోచనలానే అనిపిస్తుంది తమ్ముడూ. కానీ సమస్య ఏంటంటే, ఎవరైనా మీరు నమ్మేది ఏంటి అని అడిగినప్పుడు మేము నమ్మేది "బైబిల్‌లో ఉన్నది అంతా" అని చెబితే, మన సమాధానం సాంకేతికంగా కరక్టే. కానీ మన సమాధానం ఆ వ్యక్తికి ఉపయోగపడేదిగా ఉండదు. ఉపయోగపడే సమాధానంగా "మేము త్రిత్వంను, మానవులంతా పాపులు అనీ, యేసుప్రభువు సిలువ కార్యాన్ని...., మొదలైనవి నమ్ముతామని" ఒక లిస్ట్ చెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే "క్రైస్తవ ప్రాథమిక సిద్ధాంతాలను" ప్రత్యేకంగా రాయాల్సిన అవసరం వచ్చింది.

అర్థమైంది అన్నా. రెండవ కోణంలో "ఏవి ప్రాథమికం? ఏవి కావు? అని ఎలా నిర్ధారిస్తాము? అవి ఏవి?" అన్నాడు ఆదర్శ్. దానికి రమేష్ అన్న "విశ్వాసి అని పిలవబడాలంటే ముఖ్యమైనది రక్షణ. కాబట్టి ఒక వ్యక్తి రక్షణకు అవసరమైన వాటిని ప్రాథమిక సిద్ధాంతాలు అని చెప్పవచ్చు. వీటిని లిస్ట్‌గా చేయడానికి మనం బైబిల్‌లోని అనేక వాక్యాల ను రిఫరెన్స్‌లుగా తీసుకోవాలి. వాటిలో కొన్ని- యోహాను 3:16, 1 కొరింథీ 15:1-5, హెబ్రీ 11:6, అపో.కా.16:31, ఎఫెసీ 2:8-9, రోమా 10:9, రోమా 6:23, 1తిమో 3:16. నార్మన్‌గైజ్లర్, వెనేగ్రూడెమ్, జాన్ మెక్‌ఆర్థర్ వంటి వారు ఇలాంటి అనేక వాక్యాలను క్రోడీకరించి చెప్పిన ప్రకారం, రక్షణకు అవసరమైన ప్రాథమిక సిద్ధాంతాలను ఒక లిస్ట్‌గా క్లుప్తంగా ఇలా రాయవచ్చు.

1. బైబిల్‌లోని 66 పుస్తకాలలోనిదంతా దేవుని వాక్యం, లోపరహితం మరియు మనపై సంపూర్ణ అధికారం కలిగినది.
2. దేవుడు ఒక్కడే, ఆయన సార్వభౌముడు, త్రిత్వమైన తండ్రి-కుమార-పరిశుద్ధాత్ముడు.
3. మానవులంతా పాపులే.

4. యేసు ప్రభువు కన్యక గర్భాన జన్మించారు. ఆయన సంపూర్ణ మానవుడు, సంపూర్ణ దేవుడు. ఆయన పాప రహితుడు.

5. మానవ రక్షణ కార్యం కోసం ఆయన సిలువపై మరణించాడు. పునరుత్థానం చెందాడు. ఆరోహణమయ్యాడు. ఇప్పుడు మనకోసం విజ్ఞాపన చేస్తున్నాడు.

6. ఆయన త్వరలో వ్యక్తిగతంగా రెండవ రాకడలో రాబోవుచున్నాడు.

7. దేవునిపై విశ్వాసం ద్వారా, కృపచేతనే, పరిశుద్ధాత్ముని కార్యం ద్వారానే రక్షణ.

(స్థలాభావం వల్ల పై ఏడు సిద్ధాంతాలను విశదీకరించకుండా క్లుప్తంగా రాయడం జరిగింది).

వీటిలో ఏకీభవించిన మనం అందరం విశ్వాసులభంగా కలసిమెలసి ఐక్యతతో ఉందాం. ఒకవేళ ఎవరైనా క్రైస్తవులమని చెప్పుకొంటూ వీటిలో కొన్నింటితో విభేదిస్తే, వారిని విశ్వాసులుగా పరిగణించడం చాలా కష్టం. ఒకవేళ మిగతా చిన్న చిన్న విషయాలలో విభేదాలు ఉన్నా ఏకత్వాన్ని ముందు పెట్టుకొని, విభేదాలు పక్కనబెట్టి ప్రేమతో కొనసాగాలి. ఇలా కొనసాగేటప్పుడు రెండు ప్రమాదాలు ఉండవచ్చు.

1. అవసరమైన ప్రాథమిక సిద్ధాంతాలను సహితం నమ్మకపోయినా ఫర్వాలేదులే అనడం తప్పు. ప్రాథమిక సిద్ధాంతాల విషయంలో మనం ఖచ్చితంగా ఉండాలి. అయితే వీటిని నమ్మని వారిని ద్వేషించాలని కాదు. వారిని సహితం మనం ప్రేమించాలి. ప్రేమతో సత్యం చెప్పాలి. కానీ వారితో ఏకత్వం కలిగి ఉండలేము.

2. ప్రధానం కాని వాటిని ప్రాథమిక సిద్ధాంతాలుగా చెబుతూ, అనేక మందిని, వీరు విశ్వాసులే కాదు అన్నట్లుగా చూడడం కూడా తప్పే. ఈ రెండు గుంపులలో మనం ఉండవద్దు.

చివరిగా మనం యేసు ప్రభువు కోరినట్టు ఏకమైవుండే క్రైస్తవులుగా, "ఇన్ ఎసెన్షియల్స్ యూనిటీ, ఇన్ నాన్ ఎసెన్షియల్స్ లిబర్టీ అండ్ ఇన్ ఆల్ థింగ్స్ ఛారిటీ" ని పాటించే విశ్వాసులుగా ఉండడానికి దేవుడు మనకు సహాయం చేసి నడిపించాలని ప్రార్థిద్దాం' అంటూ రమేష్ అన్న మొకరించాడు.

**– యం. కోదండరామ్,** హైదరాబాద్

కవిత



## ఐక్యతకు చిరునామా

ఓర్పు లేని చోట సహనం ఉండదు
సహనము లేని చోట సమాధానం ఉండదు
సమాధానం లేని చోట పరిశుద్ధత ఉండదు
పరిశుద్ధత లేని చోట క్రీస్తు ఉండదు
క్రీస్తు లేని చోట ఐక్యత ఉండదు

చీకటి ఉన్న చోట వెలుగు ఉండదు
వెలుగు లేని చోట కల్మషము ఉండును
కల్మషము ఉన్న చోట కపటముండును
కపటమున్న చోట ఐక్యత ఉండదు

కలిమి లేని చోట చెలిమి ఉండదు
చెలిమి లేని చోట సహవాసం ఉండదు
సహవాసం లేని చోట సంతోషం ఉండదు
సంతోషం లేని చోట స్వార్థం ఉండును
స్వార్థమున్న చోట ఐక్యత ఉండదు

వాక్యమున్న చోట రక్షణ ఉండును
రక్షణ ఉన్న చోట విశ్వాసం ఉండును
విశ్వాసం ఉన్న చోట యధార్థత ఉండును
యధార్థత ఉన్న చోట ప్రార్థన ఉండును
ప్రార్థన ఉన్న చోట ఐక్యత ఉండును

పవిత్రత ఉన్న చోట పాపము ఉండదు
పాపము లేనిచోట ఫలము ఉండును
ఫలము ఉన్న చోట నీతి ఉండును
నీతి ఉన్న చోట సత్యము ఉండును
సత్యమున్న చోట ఐక్యత ఉండును


కృప ఉన్న చోట కనికరముండును
కనికరమున్న చోట కృతజ్ఞత ఉండును
కృతజ్ఞత ఉన్న చోట ప్రేమ ఉండును
ప్రేమ ఉన్న చోట ఐక్యత ఉండును

**– సంగర్తి హరీష్,** మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

# పాలికార్ప్

**(క్రీ.శ. 69 – 156)**

**యోహాను శిష్యుడు**



రోమా సామ్రాజ్యాన్ని నీరో చక్రవర్తి పరిపాలిస్తున్న కాలంలో చెలరేగిన హింస, నిర్ఘాంతపరిచే హింసగా మారి, ఘోర హింసగా పరిణితి చెంది వేల కొలది క్రైస్తవుల్ని వధించారు. అనేకుల్ని మైదానాలలో క్రూరమృగాలకు ఎరగా వేశారు. కొంతమందిని తారుపూసిన కొయ్యమానుపై వ్రేలాడదీసి నిప్పంటించినప్పుడు కాలుతున్న ఆ వ్యక్తులు జ్వాలలవలె తోటలను వెలుగుమయం చేసేవారు. ఆ వెలుగు వెలుతురులో నీరో చక్రవర్తి, మంత్రులు ఎంతో ఆనందంతో సంబరాలు చేసుకొనేవారు.

అయితే కాలక్రమేణ నీరో మరణించాడు. ఫర్వాలేదు, ఊపిరి పీల్చుకోవచ్చు అని అనుకొంటున్న క్రైస్తవులకు ఆ తర్వాత చక్రవర్తిగా వచ్చిన డొమిషియన్ కూడా నీరోని మించిపోయాడు. తనను తాను దేవుడిగా ప్రకటించుకొని తననే మొక్కాలనే ఆజ్ఞను జారీ చేశాడు. "రోమా సామ్రాజ్యము నుంచి క్రైస్తవులు లేకుండా చేయాలి" అనే నినాదంతో ఘోర హింసకు పునాదులు పడ్డాయి.

ఆ రోజుల్లో రోమా సామ్రాజ్యంలో ఉన్న సామాజిక దూరాచారం ఏంటంటే "మనుష్యులను బానిసలుగా అమ్మడం". మనిషిని బానిసగా కొన్న వ్యక్తికే సర్వాధికారాలు ఉంటాయి. బానిస యొక్క జీవితం, మరణం మీద యజమానునికే సర్వహక్కులు ఇవ్వబడతాయి.

రోమా సామ్రాజ్యానికి ఆసియా ప్రాంతం నుంచి, స్ముర్న (టర్కీ) నుంచి బానిసలను కొనడం ఆనవాయితి.

స్ముర్నలో ఒక ఇంటిలో ఒక రాత్రివేళ ఒక చిన్నపిల్లవాడు, "అమ్మా, నిన్ను వదిలిపెట్టి వెళ్ళను, ఎప్పటికీ నీతోనే ఉంటాను" అంటూ తన తల్లిని గట్టిగా పట్టుకొని ఏడుస్తున్న అతనిని వాళ్ళ అమ్మ ఓదారుస్తూ ఉంటుంది.

"నీవు నాతోనే ఉందువు, కాని బానిసలకు సొంత నిర్ణయాలు చేసే హక్కు లేదు, యజమానునికే సర్వహక్కులు ఉంటాయి. కాబట్టి ధైర్యంగా ఉండు, నిన్ను కొనుక్కొనే యజమాని మంచివారై ఉంటారులే" అంటూ ధైర్యం చెపుతూ నిద్రపుచ్చడానికి ప్రయత్నం చేస్తుంది.

తెల్లవారితే తన కొడుకుని మార్కెట్‌లో అంగడి సరుకులాగా అమ్మాలి. అది తలచుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్న తల్లి కన్నీటిని తుడుస్తూ, ఏడవకమ్మా ఏమీ ఫర్వాలేదులే అంటూనే చిన్నపిల్లవాడు వాళ్ళమ్మ కన్నీళ్ళు తుడిచే ప్రయత్నం చేస్తూ ఉంటాడు" అతనే పాలికార్ప్".

ఆ రాత్రి వాళ్ళ అమ్మతో అంటాడు "అమ్మా, నేను కష్టపడి పని చేస్తాను, నా యజమాని మంచివాడు కాకపోయినా నా కష్టం చూసి నన్ను గౌరవించేటట్లు, నేను పెద్దవాడిని అయిన తర్వాత తన బానిసలందరిని సరిగా చూసుకొని పెద్దగా నియమింపబడేటట్లు కష్టపడి, నమ్మకముగా పని చేస్తాను, ఏమీ ఫర్వాలేదు అమ్మా, ధైర్యముగా ఉండు, ఏడవకమ్మా అంటూ తల్లితో చెప్తాడు.

ఆ తల్లి ఆ పూరి పాకలో, చిన్న చాప మీద కూర్చొని

అలా నిద్రలోనికి జారుకొంటుంది. కాని పాలికార్ప్‌కి నిద్ర పట్టదు. మనసంతా ఒకటే ఆలోచనలు, ప్రశ్నలు "నన్ను ఎవరు? ఎలా కొనుక్కొంటారు? మరల ఇంటికి వస్తానా? నా యజమాని ఎలాంటివాడు? అక్కడ ఎన్ని కష్టాలు పడాలి, ఎలాగైనా అక్కడ అందరి కంటే ఎక్కువ కష్టపడి, నమ్మకముగా ఉండాలి". ఇలాంటి ఆలోచనలతో అసలు నిద్రపోలేదు.

అలా ఆలోచిస్తుండగానే తెల్లవారుతుంది. మార్కెట్ అంతా సందడిగాను, హడావుడిగాను ఉంటుంది. చిన్నవాడైన పాలికార్ప్ ఒకచోట అమ్మకానికి కూర్చుంటాడు.. చాలా బేరసారాలు జరుగుతుంటాయి. ఎట్టకేలకు పాలికార్ప్ అమ్ముడుపోతాడు. అయితే పాలికార్ప్‌ని కొనుక్కొన్నది యజమానుడు కాదు యజమానురాలు, ఆవిడ పేరు "కాలిస్టో".

రోజులు దొర్లిపోతున్నాయి. పాలికార్ప్ బానిసగా తన యజమానురాలైన 'కాలిస్టో' దగ్గర మంచి పేరు తెచ్చుకొంటాడు. తన కష్టం, నమ్మకత్వాన్ని బట్టి పాలికార్ప్ ఆమె ఇంటిలో బానిసగా గాక కొడుకుగా పరిగణించబడి ఎదుగుతుంటాడు.

పాలికార్ప్ బానిసగా బతుకుతున్న రోజులలోనే యేసుక్రీస్తు ప్రభువును రక్షకుడిగా అంగీకరిస్తాడు. అది ఎలా జరిగిందనేది స్పష్టంగా తెలియదు. క్రీస్తును అంగీకరించడం తన జీవితంలో గొప్ప ఆశీర్వాదముగా ఎంచుకొన్నాడు.

మరొక దీవెన ఏంటంటే 'కాలిస్టో' చనిపోయేటప్పుడు తన ఆస్థినంతటిని పాలికార్ప్‌కి ఇస్తుంది. బహుశా వారసులు లేని కారణాన్ని బట్టి గానీ లేక పాలికార్ప్ నమ్మకత్వాన్ని బట్టి గానీ ఇచ్చి ఉండవచ్చు.

అనతికాలంలోనే చిన్న బానిసగా వచ్చిన పాలికార్ప్ ఇప్పుడు స్ముర్న పట్టణములో ధనవంతుడు, విద్యావంతుడు అయ్యాడు. బానిసగా ఉంటూనే చదవడం, రాయడం నేర్చుకొన్నాడు. ఎంత ఆశ్చర్యం నమ్మకత్వం, కష్టపడేతత్వం ఎంత గొప్ప స్థానానికి తీసుకెళ్ళింది.

పాలికార్ప్ తనకున్న ధనాన్ని సొంతానికి వాడుకోలేదు. సువార్త ప్రకటించడానికి విరివిగా ఖర్చు పెట్టేవాడు. ఆయన ఎప్పుడూ ఇలా అంటుండేవాడు "నేను వంద సం॥రాల క్రితం పుట్టి ఉంటే నేను యేసుక్రీస్తు ప్రభువును కన్నులారా చూసి ఉండేవాడిని. అయినా ఫర్వాలేదు భక్తుడైన యోహానుకి యేసుక్రీస్తు వారు బాగా తెలుసు, నా యజమానుని గురించి ఆయన చెప్పినవన్నీ నేను నమ్ముతాను" అని యోహాను శిష్యునిగా పేరుపొందాడు.


ఆ రోజులలో స్ముర్న సంఘంలో పెద్దగా ఉంటూ బిషప్‌గా పిలువబడేవాడు. ఆయన సేవ చేస్తున్న రోజులలో చాలాసార్లు తన కమిట్‌మెంట్‌ని గుర్తు చేసుకొనేవాడు. పాలికార్ప్ బానిసగా అమ్మబడడానికి ముందు రాత్రి "నా యజమానునికి నేను బానిసగా ఉంటాను. కష్టపడి పనిచేసి, నమ్మకముగా ఉంటాను" అనే మాటలు పదే పదే గుర్తు చేసుకొనేవాడు. "ఒకప్పుడు నా యజమాని 'కాలిస్టో'. ఇప్పుడు నా యజమాని యేసుక్రీస్తు ప్రభువు, కాబట్టి ఆయనకు మంచి బానిసగా ఉంటాను, ఆయన ప్రజలకు సేవ చేస్తాను" అనే తీర్మానముతో జీవించి, అనేకమందిని ప్రభావితం చేస్తాడు.

సరిగ్గా డొమిషియన్ పరిపాలన తర్వాత 50 సం॥రాలలో అరేబియస్ చక్రవర్తిగా పరిపాలిస్తున్నాడు. స్ముర్నలో కూడా హింస చెలరేగింది.

అప్పటికే పాలికార్ప్ వయస్సు 86 సం॥లు. స్ముర్న సంఘానికి బిషప్‌గా ఉన్న రోజులలో రాజు యెదుట పాలికార్ప్ హాజరు కావాలనే ఆజ్ఞ వచ్చింది. వయోవృద్ధుడైన 86 సం॥రాలు పాలికార్ప్ ప్రేమపూర్వకంగా నమ్మకముగా స్ముర్న సంఘములో సేవ చేశారు.

ఒక సేవకుడు మోసగించి పాలికార్ప్ సమాచారాన్ని, స్థలాన్ని సైనికులకు తెలియజేస్తాడు. సైనికులు భవనం చుట్టూ గుమ్మికూడి ఉండగా పాలికార్ప్ ఇంటి మీద ప్రార్థన చేసుకొంటూ ఉంటాడు. తప్పించుకొని పారి పోకుండా, "ప్రభువు చిత్తం జరుగును గాక" అంటూ క్రిందకు వచ్చి, సైనికులకు భోజనం పెట్టి, వాళ్ళు తింటుండగా ప్రార్థన చేసుకోవడానికి సమయం ఇమ్మని అడిగి "తన ముందున్న శ్రమలను భరించే శక్తిని ఇమ్మని, విశ్వాసాన్ని కాపాడుకొనే కృపనిమ్మని తన గురించి, తన స్ముర్న సంఘము గురించి ప్రార్థిస్తాడు". కఠినులైన సైనికులు పాలికార్ప్ ఆప్యాయత, ప్రేమ, ప్రార్థనను చూసి కదిలించబడతారు.

కొద్దిసేపటికి పాలికార్ప్‌ని సైనికులు గవర్నర్ ముందు నిలవబెడతారు. గవర్నరు "తన రక్షకుని ఎరుగను" అని బొంకమని పాలికార్ప్‌ని ఒత్తిడి




చేస్తాడు. కాని పాలికార్ప్ మాత్రము ఒప్పుకోడు. చాలా మొండిగా ఉంటాడు. గవర్నరు, పాలికార్ప్‌ను చూసి "నీ క్రీస్తును దూషించు, అప్పుడు నిన్ను విడుదల చేస్తాము" అని అంటాడు. అయితే పాలికార్ప్ గొప్ప స్వరంతో "86 సం॥ములు నా రక్షకుని సేవించాను, ఆయన నాకెన్నడూ ఏ కీడు చేయలేదు. నన్ను రక్షించిన నా రాజుని నేనెలా దూషిస్తాను?" అని బదులిస్తాడు.

అయితే గవర్నరు క్రూరమృగాల గూర్చి, కొయ్య మానుపై కాల్చడం గూర్చి చెప్పి పాలికార్ప్‌ను భయపెట్టడానికి ప్రయత్నిస్తాడు. పాలికార్ప్ గవర్నరుతో "కాసేపు కాల్చే మంట గురించి నీవు నన్ను భయపెడుతున్నావు. దుష్టులకై నిత్యము కాలే అగ్ని ఉన్నదని నీకు తెలియదా?" అని అనేసరికి, అక్కడ కూర్చున్న ప్రజలంతా ఉగ్రులై "అతనిని కొయ్య మానుపై కాల్చండి" అని గట్టిగా కేకలు వేస్తారు. వారి కేకలు గెలుస్తాయి, పాలికార్ప్‌ను కాల్చడానికి అంతా సిద్ధం చేయమని ఆజ్ఞ జారీ అవుతుంది.

చివరిసారిగా పాలికార్ప్ ప్రార్థన చేస్తాడు "సర్వశక్తిమంతుడైన ప్రభువా, నీ కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు శ్రమలలో పాలుపొందడానికి, నీ సాక్షులలో ఉండడానికి, హతసాక్షిగా ఉండడానికి యోగ్యునిగా ఎంచినందుకు నేను నిన్ను స్తుతించుచున్నాను. నిత్యమూ నీకే మహిమ కలుగును గాక".

పాలికార్ప్‌ని ఒక కొయ్యకు కట్టేసి నిప్పంటిస్తారు. మంటలు అతని దేహము చుట్టూ ఒక వలయంలా ఏర్పడి తల వరకు చేరతాయి. అక్కడ అగ్నిజ్వాలలు కిరీటంగా ఏర్పడతాయి. మంటలు అతన్ని కాల్చక పోవడాన్ని బట్టి శత్రువులు విసిగిపోయి, ఒక సైనికుడు పదునైన కత్తితో అతని గుండెలలో పొడిచాడు. కాసేపటికే చనిపోయిన పాలికార్ప్‌ని మంటలు దహించివేశాయి. హతసాక్షిగా నిలిచిపోయాడు.

"మరణము వరకు నమ్మకముగా ఉండుము మరియు నేను జీవకిరీటము ఇచ్చెదను" అని స్ముర్న సంఘమునకు యోహాను రాసిన మాటలు పాలికార్ప్ విషయంలో సజీవ సాక్ష్యముగా మనకు కన్పిస్తున్నవి...



"కొంచెములో నమ్మకము...
మరణము వరకు నమ్మకము...
జీవ కిరీటం మనదగును"...

చివరిగా, దేవుడు పాలికార్ప్‌ను ఒకమంచి యజమానురాలి దగ్గర ఉంచాడు, రక్షించుకొన్నాడు, స్ముర్న సంఘములో సేవకుడిగా, బిషప్‌గా సేవ చేశాడు. వీటన్నిటిలో దేవుని కృపను గమనించ గలము.

ఇప్పటికీ అదే "దేవుడు".. అయితే మన నమ్మకత్వాన్ని ప్రశ్నించుకోవాలి. మన జీవన విధానాన్ని ప్రశ్నించుకోవాలి. హింసలో, శ్రమలలో మన స్టాండ్‌ని ఆలోచించుకోవాలి.

జీవ కిరీటం కోసం నిలబడుదుము గాక..

**– యం. గాలెయ్య,** భీమవరం





# పుకార్లు కలిగించే నష్టం

"లేనివార్తను పుట్టింపకూడదు" - నిర్గమ 23:1

ఒకసారి ఒక స్త్రీ స్థానిక పాస్టర్ గురించి వేడి వేడి పుకార్లు వ్యాపింపజేసింది. దానితో అతను ఏదో తప్పు చేస్తున్నాడన్న వార్త ఆ పట్టణమంతా వ్యాపించింది. చివరికి పాస్టర్‌కు ఈ విషయం తెలిసి ఎంతో మానసిక వేదనకు గురయ్యాడు. కొన్ని రోజులకు ఆమె తాను విన్న పుకారు నిజం కాదని తెలుసు వెంటనే ఆ పాస్టర్ దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పి క్షమాపణ కోరింది. ఆ పాస్టర్ ఆమెను క్షమించి ఒక పాఠం నేర్పించాలి అనుకొని ఒక చిన్న పనిని చేయమని చెప్పాడు. చిన్న చిన్న ఈకలతో నిండి ఉన్న ఒక దిండును తీసుకొని రమ్మన్నాడు. గాలి బాగా వీస్తున్నప్పుడు ఆ దిండులోని ఈకలన్నిటినీ కదిలించమన్నాడు. అవి గాలిలో కొట్టుకొని వెళ్ళిన తర్వాత వాటిలోని ప్రతి ఈకను ఏరి తీసుకొచ్చి దిండులో పెట్టమని చెప్పాడు. పాస్టర్ చెప్పినట్లే ఆమె ఆ దిండును తీసుకుని గాలి వచ్చినప్పుడు ఈకల్ని విదిలించింది. ఈకలు గాలి వేగాన్ని బట్టి నలుదిశలా వేగంగా దూరంగా ఎగిరి పోయాయి. తర్వాత ఆయన చెప్పినట్లు ఆమె వాటిని పట్టుకొని దిండులో పెట్టడానికి చాలా కష్టపడింది కానీ తన ప్రయత్నం వ్యర్థమయ్యింది. ఎందుకంటే ఈకలు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయాయి.

అప్పుడు ఆయన ఆమెతో ఇలా అన్నాడు. నీవు నా గురించి ఒక తప్పుడు వార్తను, అది వాస్తవమా, కాదో అని నిర్ధారించుకోకుండా అదే పనిగా ఎంతోమందికి చెప్పావు. తర్వాత నేను మంచివాణ్ణి అని తెలుసుకున్నావు. తన వ్యక్తిత్వానికి కలిగిన నష్టాన్ని పూడ్చడం అంటే ఎగిరిపోయిన అన్ని చోట్లకు ఎగిరి పోయిన ఆ ఈకల్ని పట్టుకొని తీసుకొచ్చి దిండులో పెట్టడం. నీవు ఎవరెవరికి చెప్పావో వారందరి దగ్గరికి మళ్ళీ పోయి నేను మంచివాడిని అని చెబుతావా? అని ప్రశ్నించగానే ఆమె తలదించుకుని బిగ్గరగా క్షమించండి అని ఏడ్వటం ప్రారంభించింది.

పుకార్లను వ్యాప్తిచేయడం ద్వారా ఒక వ్యక్తి గౌరవ మర్యాదలను నాశనం చేయవచ్చు. ఇతరుల గురించి నీకు చెప్పే వ్యక్తి, నీ గురించి కూడా ఇతరులకు చెబుతాడని గుర్తుంచుకోవాలి. 'లేనిపోని వార్తలను పుట్టించే వారు వెన్నుపోటు పొడిచే వారితో సమానం" అని అంటాడు జేబి ఫిలిప్స్. కొండెములాడే, కీడుచేసే, నిందలు మోపే నాలుక వల్లే ఆఫ్రికాకు మిషనరీగా వెళ్ళిన డేవిడ్ లివింగ్‌స్టన్ భార్య అతిత్వరగా చనిపోయింది.

యేసయ్య ఎప్పుడూ సత్యమే మాట్లాడారు. అవి దయగలిగినవిగా ఉన్నాయి. అనవసరమైనవి ఎప్పుడూ మాట్లాడలేదు. పాపాత్మురాలైన సమరయ స్త్రీని ఆయన 'అమ్మా' అని దయతో పలకరించారు. ఒక దశలో 'నీవు సత్యమే చెప్పితివి' అని ప్రోత్సహించాడు. ఫలితంగా ఒక జీవితం కట్టబడింది. ఆమె అనేక జీవితాలను వెలిగించింది. మాటలతో జీవితాల్ని కట్టవచ్చు, నాశనం చేయవచ్చు. జీవ మరణములు నాలుక వశము (సామెతలు 18:21). నాలుక చిన్న అవయవము అయినా బహుగా అదిరిపడును,... నాలుక అగ్నియే.. (యాకోబు 3:5,6)

సాధారణ వ్యక్తి ఒక వారంలో మాట్లాడే మాటలు 100 పేజీల పుస్తకం నింపుతాయని ఒక అంచనా. ఈ మాటల్లో ఎన్ని మాటలు ఇతరులకు ఆశీర్వాదకరంగా, ఎన్ని ప్రోత్సాహపరిచేవిగా, ఎన్ని ఆదరించేవిగా, ఎన్ని ఇతరుల్ని గాయపరచేవిగా, ఎన్ని నిరుత్సాహపరిచేవిగా, ఎన్ని వ్యర్థమైనవిగా ఉన్నాయో పరీక్షించుకోవాలి.

ఆయన శిష్యులంగా ఆయన మాదిరిని 'మాటల్లో' కూడా పాటిస్తే అనేకులకు మన మాటలు ఆశీర్వాదకరంగా ఉంటాయి. అలా విశ్వాసుల మాటలు ఉన్నప్పుడు జీవితాలు కట్టబడడం, కుటుంబాలు కట్టబడడం, సహవాసాలు కట్టబడడం, సంఘాలు కట్టబడడం చూస్తాం. పరిశుద్ధాత్మ దేవుని ఆధీనంలో మన మాటలు ఉండునుగాక!

– పి. సునీల్ జాకబ్, ఎడిటర్



# ప్రాధాన్యతల్లో తారుమారు

*దేవునికివ్వాల్సిన ప్రప్రథమ స్థానం ఆయనకిచ్చేస్తే, మిగిలినవన్నీ వాటంతట అవే వాటి స్థానాల్లో సర్దుకొంటాయి! గనుక దేవునికి మొదటి స్థానమిద్దాం.*

## కత్తిమీద సాము

ప్రస్తుత పోటీ యుగంలో గ్రాడ్యుయేట్స్‌గా దేవుడు మనకిచ్చిన ఉద్యోగాల్లో రాణిస్తూ, చక్కని సాక్ష్యాన్ని నిలబెట్టుకొంటూ, కుటుంబంలో ఓ మంచి భర్తగా/భార్యగా, మంచి తండ్రిగా/తల్లిగా మన బాధ్యతల్ని సమర్థవంతంగా నెరవేరుస్తూ, విద్యార్థి పరిచర్యలో చురుగ్గా పాలుపంచుకోవడమనేది నిజంగా కత్తిమీద సాము లాంటిదే. సర్కస్‌లో జగ్లర్‌ను మీరు చూసే ఉంటారు. తనకున్న రెండు చేతుల్తో ఒకేసారి 6 బంతుల్ని హ్యాండిల్ చేస్తుంటాడు. 2 బంతుల్ని చేతిలో ఉంచుకొని 4 బంతులు గాలిలో ఉండేలా ఎంతో వేగంగా చాలా నైపుణ్యంతో ఏ కాగ్రతతో ఆ పని చేయడం మనం గమనిస్తాం. మనం మన ఉద్యోగాన్ని కుటుంబాన్ని పరిచర్యను సమతుల్యం చేసుకొంటూ అన్నిటికీ న్యాయం చేయడం అలాంటిదే.

## సమతుల్యంలో సమస్యలు

ప్రతి గ్రాడ్యుయేట్ ప్రతివారం ఇజియఫ్‌కు హాజరవ్వాలి, ఓ మైక్రోప్రేయర్ సెల్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ ఓ సీనియర్ స్టూడెంట్ సహాయంతో కొత్తగా మారు మనసు పొందిన మరో ఇద్దరి గురించి శ్రద్ధ తీసుకోవాలి. వీలైతే ఓ ఇబియస్ / బిబియస్ తీసుకోవాలి. పరిచర్య అవసరాల కనుగుణంగా బాధ్యతలు, అసైన్‌మెంట్స్ తీసుకోవాలి. జీవిత భాగస్వామి అసైన్‌మెంట్స్ తీసుకోవడంలో సహకరించాలి. విద్యార్థులు, స్టాఫ్, స్పీకర్స్‌కు ఇంటిని తెరిచి ఉంచాలి. రాష్ట్రంలో గ్రాడ్యుయేట్స్ కుటుంబాల్ని గమనిస్తే – కొన్ని కుటుంబాలు ఉద్యోగాల్లో రాణిస్తూ పరిచర్యకు కొంత ఆర్థిక సహకారం అందించగల్గుతున్నాయి గానీ ఇంకే విధంగానూ పాలుపంచుకోవడంలేదు. మరికొన్ని కుటుంబాలు పరిచర్యలో చురుగ్గా పాల్గొంటూ వారి కుటుంబ బాధ్యతల్ని నెరవేర్చడంలో విఫలం కావడం చూస్తున్నాము. ఈ మూడింటినీ చక్కగా సమతుల్యం చేసుకొంటున్న కుటుంబాల్ని మన రాష్ట్రంలో వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చు.

అలాంటి కొన్ని మాదిరి కుటుంబాల్ని సన్నిహితంగా గమనించిన దాన్ని బట్టి, మా 38 సంవత్సరాల

వైవాహిక, పరిచర్య జీవిత అనుభవాన్ని బట్టి కొన్ని ఆచరణాత్మక విషయాలు ఈ వ్యాసంలో చెప్పాల నుకొంటున్నాం. యువ గ్రాడ్యుయేట్ కుటుంబాలు అలా సమతుల్యం చేసుకొంటూ మాదిరి చూపించ లేకపోతే తర్వాత తరం విద్యార్థులు అనుసరించడానికి మార్గదర్శకులు ఉండరు.

## దేవుడు సహాయం చేస్తాడు, సమకూరుస్తాడు

విద్యార్థుల మధ్య పరిచర్య పట్ల మనకు దర్శనం, భారం ఇచ్చిన మన ప్రభువుకు మనమెంత బాధ్యతగల ఉద్యోగంలో బిజీగా ఉన్నామో, మన కుటుంబ బాధ్యతలు ఎంత బరువైనవో, మన ఆరోగ్యం ఎలాంటిదో, మనకెంత విరామ సమయం ఉంటుందో తెలియదంటారా? తెలిసే మనకీ పరిచర్యను ఆయన అప్పగించారు కదా? 'దేవుని ఆజ్ఞలు, దేవుడిచ్చే సామర్థ్యాలు' అన్న విషయం మర్చిపోవద్దు. బాధ్యతలిచ్చిన దేవుడు వాటిని నెరవేర్చడానికి కావాల్సిన సమయం, వనరులు, శక్తి సామర్థ్యాలన్నీ సమకూరుస్తాడు. ఇంకో ప్రాముఖ్యమైన విషయం ఏంటంటే, మనం పది నిమిషాల్లో చేసే పనిని ఇరవై నిమిషాల్లో చేస్తున్నాం. కొంచెం చురుగ్గా పని చేయడం అలవాటు చేసుకొందాం.

## సమతుల్యం చేసుకోవడం ఎలా?

### ఉద్యోగం-పరిచర్య

దేవుడు మనల్ని ఓ ఉద్యోగంలో ఉంచాడంటే, అది ఆ స్థలంలో ఉండి మనం మన తరానికి సేవచేసే భాగ్యం, బాధ్యత, ఆధిక్యత అని గుర్తిద్దాం. (అ.కా 13:36,37). ఈ విషయం మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేసుకొందాం. మనకిచ్చిన పనిని ఇష్టపూర్వకంగా చేద్దాం. నమ్మకంగా, బాధ్యతతో, మనసుపెట్టి, ఏకాగ్రతతో చేద్దాం. ప్రయత్న లోపం లేకుండా చూసుకొందాం. అధికారుల కోసం గాక ప్రభువు కోసం అని గమనించి చేద్దాం. మనం నమ్మకత్వానికి ఇచ్చినంత ప్రాధాన్యత నైపుణ్యానికి ఇవ్వము. 1 దిన. 28:21 వచనాన్ని చదివితే ప్రావీణ్యానికీ, నేర్పుకీ, నిపుణతకూ మన దేవుడిచ్చే ప్రాధాన్యత కన్పిస్తుంది. బెసలేలు దానికి చక్కని ఉదాహరణ (నిర్గమ 36:1). మన సహోద్యోగులు ఆదివారం, సెలవు దినాల్లో కూడా ఆఫీస్ పని చేస్తూ ఉండొచ్చు. మనం అలా చేస్తే పరిచర్యకు సమయం ఇవ్వలేం. నైపుణ్యంతో పనిచేస్తే కొద్ది సమయంలోనే ఎంతో పని చేయగలము. మిగిలిన సమయాన్ని ప్రభువు పనికి వినియోగించవచ్చు. అందుకే నైపుణ్యం కోసం ప్రార్థించడంతో పాటు, దానికోసం పట్టుదలతో కృషి చేద్దాం.

> మనసుండాలేగానీ...
> ప్రభువు సాయంతో ఉద్యోగాన్ని,
> కుటుంబాన్ని, పరిచర్యను
> సమతుల్యం చేసుకోవడం సాధ్యమే!
> మనసుంటే మార్గాలు వెదుకుతాం,
> లేకుంటే సాకులు వెదుకుతాం!
> ఆయన దైవ శక్తి జీవానికీ, భక్తికీ
> (ఉద్యోగానికీ, కుటుంబానికీ,
> పరిచర్యకూ) కావాల్సిన
> వాటినన్నిటిని దయచేస్తుంది...
> (2 పేతురు 1: 3).

వారంలో మిగిలిన 5/6 రోజులూ నమ్మకంగా పనిచేయడం వల్ల మనకి ఇజియఫ్ ఉన్న రోజునో, అసైన్‌మెంట్ ఉన్న రోజునో కొంచెం ముందుగానే (ఆఫీస్ సమయం అయిపోయిన తర్వాతనే) వెళ్ళడానికి మన పై అధికారులు అంగీకరిస్తారు. మిగిలిన రోజులన్నీ ఎంతో నైపుణ్యంతో పని చేసి ఆ డిపార్ట్‌మెంట్‌కు ఓ ఆస్తిగా మనం ఉంటే క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లకు సెలవు పొందడానికి సమస్య ఉండదు. ఇది నా 30 సంవత్సరాల అనుభవం. అఫ్‌కోర్స్, కొంతమందికి అసమంజసమైన యజమానులు ఉండొచ్చు. వారికోసం ప్రత్యేకంగా ప్రార్థిద్దాం. ఆఫీస్ సమయంలో బైబిల్ స్టడీకి ప్రిపేర్ అవ్వడం, పరిచర్యకు సంబంధించిన ఉత్తరాలు, రిపోర్ట్‌లు రాయడం మంచిది కాదు. వీలైనంత వరకు ఆఫీస్ పనిని ఇంటికి తెచ్చుకోకుండా ఉంటే మంచిది. అది కుటుంబానికీ, పరిచర్యకూ సమయం ఇవ్వడానికి తోడ్పడుతుంది. ఉద్యోగం వచ్చేంత వరకు ఉద్యోగ వేటలో బిజీ. ఉద్యోగం వచ్చాక మాది చాలా బిజీగా ఉండే ఉద్యోగం అంటారు కొందరు. ఇలాగైతే ఇంకెప్పుడు పరిచర్యకు సమయమిచ్చేది?

యేసుతో చేపలు పట్టడం గురించి మాట్లాడుతూ

> ఒక్కోసారి సమతుల్యం చేసుకోలేకపోయినా దేవునితో సన్నిహితంగా ఉండడం వల్ల ఆయన స్వరానికి సున్నితంగా స్పందించడం వల్ల మనం ఎక్కడ పొరపాట్లు చేస్తున్నామో, దేనిని నిర్లక్ష్యం చేస్తున్నామో ప్రభువు తెలియజేస్తాడు. వెంటనే సరిచేసుకొందాం.

ఓసారి సహో. మోషేబాబు గారు చెప్పిన మాటలు నాకు గుర్తు. 'మనం ఉపాధ్యాయులమైతే యేసుతో కలసి పాఠాలు చెబుదాం, బ్యాంక్‌లో పనిచేసే వాళ్ళమైతే యేసుతో కలసి బ్యాంకింగ్ చేద్దాం'. చేసే పనిని మనమే కాకుండా ప్రభువు సాయం తీసుకొని, ప్రభువుతో కలసి పనిచేద్దాం. అప్పుడు సమర్థవంతంగా పని చెయ్యగల్గుతాం. మంచి ఫలితాలు చూడగల్గుతాం. నా మట్టుకు నేను బ్యాంక్ మేనేజర్‌గా నా బ్యాంక్ అభివృద్ధి కోసం, సహోద్యోగుల సహకారం కోసం, రైతులకు మంచి పంట కోసం, పంటకు మంచి ధర కోసం, అప్పు తీసుకొన్న వాళ్ళు ఆ అప్పు తీర్చాలనే మంచి మనసు కోసం ప్రార్థించే వాళ్ళం. నా భార్య తన విద్యార్థుల కోసం, వారి పరీక్షా ఫలితాల కోసం ప్రార్థించేది. ప్రభువు సహాయంతో ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లోంచి నా బ్యాంక్‌కి 'ఎ' రేటింగ్ తెచ్చుకోగల్గాను. ప్రభువుకే మహిమ.

### సంఘం-పరిచర్య

మనమంతా మన స్థానిక సంఘాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన వారం. కానీ ఇఐయఫ్ లోనూ, స్థానిక సంఘంలోనూ ఒకేసారి బాధ్యతలు తీసుకుంటే రెండిటికీ న్యాయం చేయలేము. మన సంఘ కాపరి కి మన పరిచర్య గురించి, దానిలో మన బాధ్యతల గురించి తెలిపి వారి సహకారాన్ని కోరాలి.

### కుటుంబం-పరిచర్య

మన జీవితాల్లో దేవునికి మొదటి ప్రాధాన్యత, ఉద్యోగానికీ, కుటుంబానికీ, ప్రభువు పరిచర్యకూ తరువాత ప్రాధాన్యతలుగా భావిస్తాం. మొదటి మూడూ ముగించాక పరిచర్య అంటే, అసలు దానికి సమయం ఉండదు. పికెడి.లీ అనే భక్తుడు ఒకసారి ఇలా చెప్పాడు. 'పై ప్రాధాన్యతలను అనుసరించిన వారెవరూ ప్రభువు కోసం ఏదీ సాధించిన దాఖలాలు సంఘ చరిత్రలో లేవు'. మనం ఏదైనా సాధించా లంటే, ఏదో ఒకటి పోగొట్టుకోవాలి. కుచ్ పానే కేలియే కుచ్ ఖోనాపడ్తా హై! ఉద్యోగంలో మనం నమ్మకంగా ఉండాలి. ఆ సమయాన్ని దొంగిలించ కూడదు. కాబట్టి కుటుంబానికిచ్చే సమయాన్ని పరిచర్యకు వెచ్చించాల్సి ఉంటుంది. అలా చేస్తే కుటుంబం ఇబ్బంది పడుతుంది. అందుకే పికెడి.లీ గారే తన అనుభవంలో నుంచి ఓ పరిష్కారాన్ని కూడా చెప్పాడు. పరిచర్యలో కుటుంబం పాల్గొనేలా చేయండి. అలా చేసి మేమూ మేలు పొందాం.

### మారుతున్న ప్రాధాన్యతలు

మనలో చాలామంది గ్రాడ్యుయేట్స్‌కి కుటుంబాలే సర్వస్వం. పెళ్ళయ్యేంత వరకూ చాలా చురుగ్గా పనిచేసిన వాళ్ళు పెళ్ళయ్యాక భార్యాపిల్లలే లోకంగా బతుకుతూ పరిచర్యను నిర్లక్ష్యం చేయడం చూస్తు న్నాం. పెళ్ళయ్యాక మొదటి సంవత్సరం బాధ్యతలు తీసుకోవడం వాక్యానుసారం కాదని వాటిని పక్కన పెడుతున్నారు. అయితే అంతలోనే గర్భం, నెలలు నిండడం, కాన్పు, చిన్నపిల్లలు అంటారు. 'వాళ్ళు కొంచెం పెద్దవాళ్ళయ్యాక పాల్గొంటాం' అంటారు. అంతలో వాళ్ళు బడికి వెళ్ళడం మొదల వుతుంది. 'పిల్లల్ని బడికి పంపాలి. వచ్చాక హోం వర్క్ చేయించాలి. ఆరోగ్యాలు పాడైపోతున్నాయి' అంటారు.

అయితే మనం ఇంకెప్పుడు కుటుంబంగా పాల్గొనేది? కాన్పుకు గంటముందు క్రిస్మస్ ఫంక్షన్‌కు విద్యార్థుల్ని తీసుకొచ్చిన లేడీ గ్రాడ్యుయేట్ నాకు తెలుసు. 20 రోజుల బిడ్డను ఒడిలో పెట్టుకొని బైబిల్ స్టడీ తీసుకొన్న గ్రాడ్యుయేట్స్‌ను నేనెరుగుదును. దేవుడు భార్యా బిడ్డల్ని పరిచర్యకు ఆటంకాలుగా ఇస్తాడని మేమనుకోం. ఇవన్నీ జీవితంలో భాగాలే. మన ముందు వెళ్ళిన గ్రాడ్యుయేట్స్ వీటన్నిటిని చేసుకొంటూనే పరిచర్యకు సమయం ఇవ్వడాన్ని బట్టి ప్రస్తుతం పరిచర్య ఇంత బాగుంది.

కొంతమందికి పరిచర్యే సర్వస్వం. భార్యా బిడ్డలు,

తల్లిదండ్రులు ఏమైపోయినా ఫర్వాలేదు. వాళ్ళ అవసరాలు, ఆరోగ్యాలు దేవుడే చూసుకొంటాడు అంటూ పూర్తిగా పరిచర్యలో మునిగిపోతారు. నిజమే, ఆయన చూసుకొంటూ ఉంటే భర్తగా తండ్రిగా నువ్వు చేయాల్సింది నీవు చేయాలిగా?! ఇది ఇంకో విపరీత ధోరణి. దీనిని దేవుడు మెచ్చడు.

అందుకే పరిచర్యలో కుటుంబం పాల్గొనేలా చేయడమే ఉత్తమ పరిష్కారం. అప్పుడు మీరు రెండిటికీ న్యాయం చేయగల్గుతారు.

## కుటుంబంగా పరిచర్యలో పాల్గొనడం

మీరు చేసే పరిచర్యలో మీ భాగస్వామి, పిల్లలు పాలుపుచ్చుకొనేలా చేయండి. మీరు ఏం చేస్తున్నారో, ఏ అసైన్‌మెంట్ తీసుకొంటున్నారో వారితో పంచుకోండి. సిద్ధపాటులో, విశ్లేషణలో వారినీ భాగస్తుల్ని చేయండి. క్యాంపస్ ప్రేయర్స్‌కి వెళ్ళినా, స్టూడెంట్ రూమ్‌కు వెళ్ళినా కుటుంబంగా వెళ్ళండి. ఏ ఒక్కరికి అసైన్‌మెంట్ ఇచ్చినా కుటుంబంగా వెళదాం. క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లకు కొంచెం ఖర్చయినా కుటుంబంగా వెళ్ళడం వలన చాలా మేలు కలుగుతుంది. ప్రయాణంలోనూ కాన్ఫరెన్స్‌లోనూ కలసి గడపొచ్చు. కుటుంబమంతా సందేశాల ద్వారా ఆధ్యాత్మిక మేలు పొందుతుంది. ఫ్యామిలీ ప్రేయర్‌కీ డిన్నర్‌కీ నిర్థిష్టమైన సమయం పెట్టుకొని కలిసి భోజనం చేయడం అలవాటు చేసుకొందాం. ఫ్యామిలీ ప్రేయర్‌లో కూడా పరిచర్యకు సంబంధించిన ముఖ్య విషయాల కోసం ప్రార్థిద్దాం. కుటుంబంగా వారానికోసారి ఉపవాస ప్రార్థన చేసుకొందాం. ఓపెన్ హోమ్‌లో భార్య పాత్ర చాలా ప్రాముఖ్యం. స్టూడెంట్స్‌ని గ్రాడ్యుయేట్స్‌ని మీ ఇంటికి పిలవాలనీ, ఆతిథ్యం ఇవ్వాలనీ మీరునుకోవచ్చు. జీవిత భాగస్వామి దానికి సహకరించేలా నచ్చజెప్పడం మీ బాధ్యత. జీవిత భాగస్వామికి ముందే పరిచర్య గురించి తెలిసి ఉంటే మంచిది. వాళ్ళ సహకారం పొందడం తేలిక. ముందుగానే ఈ పరిచర్య గురించి తెలియని వారైతే నెమ్మదిగా దర్శనాన్ని వారికి అందించాలి.

## ప్రభువుతో సాన్నిహిత్యంతోనే సమతుల్యత సాధ్యం

మనసుండాలేగానీ... ప్రభువు సాయంతో ఉద్యోగాన్ని కుటుంబాన్ని పరిచర్యను సమతుల్యం చేసుకోవడం సాధ్యమే! మనసుంటే మార్గాలు వెదుకుతాం, లేకుంటే సాకులు వెదుకుతాం!




ఆయన దైవ శక్తి జీవానికీ, భక్తికీ (ఉద్యోగానికీ, కుటుంబానికీ, పరిచర్యకూ) కావాల్సిన వాటినన్నింటిని దయచేస్తుంది...2 పేతురు 1: 3. ఈ వాగ్దానం మా జీవితంలో అనుభవ పూర్వకంగా రుచి చూశాం! ఇంతకంటే గొప్ప వాగ్దానం మనకవసరమా?

బ్యాలన్స్ తప్పడానికి కారణం తెలిసిందను కుంటున్నాను. మీ జీవితాల్లో ప్రభువుకివ్వాల్సిన ప్రథమ స్థానం ఆయనకివ్వకపోవడమే! ఆయన అందుబాటులో ఉంచిన శక్తిని వినియోగించుకోక పోవడమే!

యెహోషువా చెప్పినట్లు “నేనూ, నా ఇంటి వారును యెహోవాను సేవిస్తాం’ (యెహో 24:13) అని చెప్పాలి. యెషయాతో కలసి ‘నేనునూ, నీవు నాకిచ్చిన పిల్లలునూ ఇశ్రాయేలీయుల మధ్య మహత్కార్యములుగానూ, సూచనలుగానూ ఉన్నాము” (యెష 8:18) అని చెప్పగల్గాలి. భార్యా బిడ్డలకు ఇవ్వాల్సిన సమయం ఇస్తూనే ఉద్యోగంలో రాణిస్తూనే పరిచర్యలో చురుగ్గా పాల్గొనవచ్చని అనుభవపూర్వకంగా తెలిసినవాళ్ళం. అప్పుడప్పుడూ, పరిస్థితులను బట్టి పరిశుద్ధాత్ముని నడిపింపుతో పరిచర్య స్థానాన్ని కుటుంబానికీ, కుటుంబం స్థానాన్ని పరిచర్యకూ ఇవ్వాల్సి వస్తుంది. ఒక్కోసారి సమతుల్యం చేసుకోలేకపోయినా దేవునితో సన్నిహితంగా ఉండడం వల్ల ఆయన స్వరానికి సున్నితంగా స్పందించడం వల్ల మనం ఎక్కడ పొరపాట్లు చేస్తున్నామో, దేనిని నిర్లక్ష్యం చేస్తున్నామో ప్రభువు తెలియజేస్తాడు. వెంటనే సరిచేసుకొందాం. మొత్తం మీద ఈ కత్తి మీద సాము చేయడం మన వల్ల అయ్యే పని కాదని గుర్తిద్దాం (యోహా. 15: 5). ప్రభువు సాయంతో మాత్రం సాధ్యం సుమా! (ఫిలిప్పి 4:13). అలాంటి ఎన్నో కుటుంబాల్ని రాబోయే రోజుల్లో మన రాష్ట్రంలో చూడాలన్నదే మా అభిలాష, ప్రార్థన.

**– పి. జాన్ విక్టర్, సంధ్యా విక్టర్,** కర్నూలు

కథానిక



# అపవిత్రత నుండి పవిత్రతలోకి...

"ఛీ..ఛీ.. ఇవేం బొమ్మలు. సగం బట్టల్తో ఉన్న మనుషులు గోడెక్కి నుంచున్నట్లుగా ఉన్నాయి" అనుకొంటూ ముందుకు నడిచాడు నానీ. డిగ్రీ చదివే నానీకి ఆ రోడ్డు చిరపరిచితమే. ప్రతీరోజూ ఆ రోడ్డునుంచే నడుచుకొంటూ కాలేజీకి వెళ్తాడు. రకరకాల మనుషుల్ని చూడడం అలవాటే అయి నా, అర్ధనగ్న బొమ్మలతో ఉన్న వాల్‌పోస్టర్స్‌ను చూస్తూ నడవాల్సి రావడం నానీకి కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంటుంది.

దేవునిని తెలుసుకొని రక్షణపొందిన తొలిరోజుల్లో అసలు కంటిచూపు అటువైపు వెళ్ళకుండా నడిచేవాడు. తనవలె దేవునిని నమ్మిన స్టూడెంట్స్‌తో కలిసి ఎప్పుడూ ఏదో ఒక బైబిల్ స్టడీలోనో, రిట్రీట్ లోనో, క్యాంప్‌లోనో పాల్గొంటూ ఉండేవాడు. తరగతిలో క్లాస్ వినడం, రూముకొస్తే ఎవరో ఒక అన్నను కలవడం, సందేహాలుంటే తీర్చుకోవడం మొదలైన పనులతో కాలం తెలియకుండా గడిచిపోయేది.

రోజులు గడిచేకొద్దీ బైబిల్‌స్టడీమీద ఎందుకనో ఆసక్తి తగ్గింది. నడవాలని నిర్ణయించుకున్న దారికీ, నడుస్తున్న దారికీ పొంతన లేదు. మనసు నిలకడగా ఉండట్లేదు. ఏవేవో చేయాలని దేహం ఉవ్విళ్ళూరుతోంది. భక్తి బైబిల్ మీద ఉంచుతున్నాడు గానీ అదుపు తప్పుతున్న మనసును ఆధీనంలోనికి తెచ్చుకోలేకపోతున్నాడు. వాక్యధ్యానంలో కూర్చున్నప్పుడల్లా ఏదో తప్పు చేస్తున్నానన్న భావన పట్టి పీడిస్తోంది. లోకాన్ని చూడకుండా కళ్ళు మూసుకోవాలంటే తెలియని బాధ వేధిస్తోంది.

జీవితం సంఘర్షణతో కూడుకొన్నదనీ, మంచికీ చెడుకీ మధ్య నిరంతర పోరాటాన్ని రగుల్చుతూనే ఉంటుందనీ నానీకి అనుభవంలోకి వచ్చింది. వయసుతో పాటు శరీరంలో కలిగే మార్పులు, అప్పుడప్పుడూ పిల్లగాలిలా గిలిగింతలు పెట్టే ఏవో తెలియని కోరికలు అతడి మనసును అటూఇటూ కాని అయోమయంలోకి నెట్టడం తెలుస్తూనే ఉంది. అయినా.. ఏం చేయగలడు తను? లోకమంతా ఏదో పనున్నట్టు, ఏదో కోల్పోతున్నట్లు చెడుని చూడడానికి, చెడుని చూపించడానికి, చెడ్డపనులు చేయడానికి పరిగెత్తడం చూస్తుంటే నాని మనసు కూడా అనుకోకుండా అప్పుడప్పుడు దారి తప్పుతూనే ఉంది.

ఏది మంచి? ఏది చెడు? వాక్యానికి విధేయంగా నడవడమనేది మంచి, అవిధేయత చూపించడం చెడు! 'దేవుని యందు భయభక్తులు కలిగివుండడమంటే చెడును అసహ్యించుకోవడమే' కదా! ఇంతకీ తను చెడును ప్రేమిస్తున్నాడా? ద్వేషిస్తున్నాడా? దేవుని పోలి నడుచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడా? తన ఇష్టాన్ని నెరవేర్చుకోవడానికి తపన పడుతున్నాడా? సజీవుడైన దేవునిని అనుసరించడం మాని అశాశ్వతమైన లోకాన్ని, వ్యక్తుల్ని అనుకరించడానికి ఆరాటపడుతున్నాడా? ఎంతకీ తెగని ఆలోచనలతోనే క్లాస్‌లోకి ప్రవేశించాడు.

***

"ఏరా.. ఇంత ఆలస్యమైంది" పలకరించాడు రవి. బదులుగా నవ్వి ఊరుకున్నాడు తప్ప సమాధానం చెప్పలేదు. "సరేగానీ,ఇవ్వాళ సాయంత్రం రామూగాడి పుట్టినరోజట.సాయంత్రం పార్టీకి రమ్మంటున్నాడు" అన్నాడు రవి. అతని వంక నిర్లిప్తంగా చూస్తూ "నేనెందుకులేరా! మీరు వెళ్ళిరండి" అన్నాడు నాని. "అసలు నిన్నడగడం నా బుద్ధి తక్కువ. నువ్వెప్పుడూ ఇంతేగా! ఏదో లోకంలో ఉంటావు. సినిమాకి రమ్మంటే రావు, షికారుకి వెళ్దామంటే కదలవు" అన్నాడు చిరుకోపంగా.

రవి వంక చూసి నవ్వుతూ "మొదటి నుంచీ అంతే కదరా. మళ్ళీ కొత్తగా అడుగుతావెందుకు" అన్నాడు నాని. "అదే నేను కూడా చెప్తున్నాను. నిన్ను రమ్మన్నాము గానీ మేము చేసేవన్నీ నిన్ను చేయమనలేదుగా! చూస్తూ ఉండమంటున్నాము. దానికి కూడా బాధేనా" అన్నాడు రవి.

నానీలో ఆలోచన మొదలయ్యింది. ఇంతకుముందు కూడా ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీలకు వెళ్లాడు. వాళ్ళతోనే ఉన్నాడు కానీ వాళ్ళు చేసే పనుల్లో భాగస్వామి కాలేదు. మనసు ఎంత లాగుతున్నా ఏ మూలో ఉన్న దేవుని భయం నానీని అడుగు ముందుకు వేయనివ్వలేదు. అందమైన అనుభవాల్ని మిగిల్చినంతసేపూ జీవితమెప్పుడూ విలువైందిగానే కనిపిస్తుంది. అనుకోనివో, నచ్చనివో జరిగినప్పుడు మాత్రమే మన పరిస్థితి మనకు అర్థమవుతుంది. ఆలోచనలలోనుండి బయటపడి 'వస్తా'నన్నట్లుగా తలూపాడు నానీ.

***

> అలవాట్లు మొదట్లో సాలెగూడులా బాగానే ఉంటాయి. అవి సంకెళ్ళుగా బిగుసుకొంటేనే జీవితం ప్రమాదంలో పడుతుంది. అది తెలుసుకోకుండా లోకం వెంటపడినా, అలవాట్లలో మునిగితేలినా ప్రమాదమే!

పార్టీ మొదలయింది. ఒక పక్కగా నిల్చున్నాడు నానీ. క్లాస్మేట్స్ హడావిడిగా కనిపించారు. ఒకరిద్దరు అమ్మాయిలతో మాట్లాడుతూ అబ్బాయిలు కనిపించారు.

"ఏరా ఒక్కడివే కూర్చున్నావు? అక్కడ మన ఫ్రెండ్స్ ఉన్నారుగా వాళ్లతో మాట్లాడు" అన్నాడు రవి.

"ఎక్కడుంటే ఏమయ్యిందిలేరా? ఇక్కడ బాగానే ఉంది" అన్నాడు నానీ.

"పార్టీకి వచ్చి అంటీ ముట్టనట్లుగా ఉండకూడదు. నలుగురితో పరిచయం పెంచుకోవాలి. నాలుగు కొత్త అలవాట్లు నేర్చుకోవాలి. అంతేగానీ ఏదో పోగొట్టుకున్నట్లు దేవుడా అన్నట్లు నుంచుంటే ఎట్లా" అన్నాడు రవి.

"అందరూ అక్కడుంటే మీరిద్దరూ ఇక్కడేం చేస్తున్నారు? సిగిరెట్ కాల్చడం ఎలాగో తెలుసుకోవాలి. సీతాకోకచిలుకల్ని ఎలా పట్టుకోవాలో నేర్చుకోవాలి గానీ ముసలోళ్ళలాగా మూలన ఉంటే ఎలా? మాటలు కలిపి ముగ్గులోకి దించండి" అన్నాడు కిరణ్.



'ఛ.. ఛ... ఇవేం మాటలు! లోపలింత చెత్త పెట్టుకుని పైకి డిగ్నిఫైడ్'గా ఎలా కనిపిస్తున్నారు వీళ్ళు' అనుకొన్నాడు నానీ. బుద్ధి తక్కువై వచ్చినట్లుగా అనిపించింది ఒక్క క్షణం. మునిగిపోతామని తెలిసినా నీళ్ళల్లోకి, కాలిపోతామని తెలిసినా నిప్పుల్లోకి వెళ్లడమంటే ఇదేనేమో!

అలవాట్లు మొదట్లో సాలెగూడులా బాగానే ఉంటాయి. అవి సంకెళ్ళుగా బిగుసుకొంటేనే జీవితం ప్రమాదంలో పడుతుంది. అది తెలుసుకోకుండా లోకం వెంటపడినా, అలవాట్లలో మునిగితేలినా ప్రమాదమే!

చుట్టూ చూసి పైకి లేచాడు నానీ. ఒక్కసారిగా ఇంట్లో వాళ్ళు గుర్తొచ్చారు. ఎన్నో కష్టాలు పడుతూ వచ్చిన కూలి డబ్బుల్ని దాచి తన అవసరాలకు పంపించే తల్లిదండ్రులు కళ్ళముందు మెదిలారు. వాళ్ళ కష్టాన్ని ఆహారంగా స్వీకరిస్తూ తాను జీవిస్తున్నాడు. ఇంటిని విడిచిపెట్టి తను ఎందుకొచ్చాడు? కష్టపడి చదువుకోడానికి? కొత్త అలవాట్లు నేర్చుకొని పాడైపోవడానికా? మనసు నిండా ఏవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

పార్టీనుంచి బయటికి నడిచాడు. లోకాన్ని మాయ కమ్మేసింది. మంచేదో చెడేదో గుర్తించలేని గుడ్డివాళ్ళుగా మనుషుల్ని మార్చేసింది. ఎక్కడ చూసినా అపవిత్రతే! నడిచే దారుల నిండా, వీధి గోడల నిండా, నోటి మాటల నిండా, చేసే పనుల నిండా, బుర్రలోని ఆలోచనల నిండా... ఒకటా రెండా కోటానుకోట్ల అపవిత్ర ఆలోచనలు!


'ఇప్పుడు నేను నా ఒంటికీ, మనసుకీ అంటిన బురదను కడుక్కోవాలా? లేక వీధిలోని అపవిత్ర బురదను కూడా కొత్తగా నా ఒంటికి పూసుకోవాలా?'అని ఆలోచిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టిన నానీకి ఎదురుగా క్యాలెండర్లోని వాక్యం కనిపించింది.

"మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు, తాగుబోతుల విందులు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుడానికి గతించిన కాలమే చాలును. అపరిమితమైన ఆ దుర్వ్యాపారమందు తమతో కూడా మీరు పరిగెత్తక పోయినందుకు వారు ఆశ్చర్యపడుచు మిమ్మును దూషించుచున్నారు" (1 పేతురు 4:3,4)

తన జీవితాన్ని బట్టి దేవునిని క్షమించమని అడిగాడు. బుద్ధిగా కష్టపడి చదువుకోవాలని నిర్ణయించుకొన్నాడు. తన జీవితాన్ని బట్టి దేవునికి, తల్లిదండ్రులకు అవమానం తీసుకురాకూడదని తీర్మానించుకొన్నాడు.

***

పై చదువులు పూర్తిచేసుకొని మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. దేవునిలో దినదినం ఎదుగుతున్నాడు. పవిత్ర జీవితాన్ని జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు, తన ఊరిలోని వారు తనంటే ఎంతో సంతోషిస్తున్నారు. దేవుని చిత్తానుసారంగా వివాహం చేసుకొని విద్యార్థుల పరిచర్యలో, సంఘంలో చురుకైన పాత్రను పోషిస్తున్నాడు.



ఒకరోజు అనుకోకుండా తన డిగ్రీ స్నేహితుడైన రవిని కలుసుకొన్నాడు. ఎంతో సంతోషమేసింది. రవి పూర్తిగా తాగుడుకు అలవాటై, కుటుంబంలో ఎన్నో సమస్యలతో ఉన్నాడని తెలుసుకొన్నాడు. తన చదువుకు సరైన ఉద్యోగంలేక ప్రస్తుతం పెయింట్ పనికి వెళ్తున్నాడని తెలుసుకొన్నాడు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. చదువుకొనేటప్పుడు పార్టీలు, షికార్లంటూ జీవితమంటే అదే అన్నట్లు ఎంజాయ్ చేశాడు. దేవుని గూర్చి చెబితే విసుక్కొనేవాడు. ఇప్పుడు ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. నాని రవి కొరకు ప్రార్థన చేసి, దేవునిని నమ్ముకోమని చెప్పి కొంత ఆర్థికంగా సహాయం చేశాడు. రవి వెళ్ళిన తర్వాత నాని హృదయం దేవుడు తన జీవితంలో చేసిన మేళ్ళను తలంచుకొని కృతజ్ఞతతో నిండిపోయింది. అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు వచ్చాయి.

**– డా. జడా. సుబ్బారావు,** నూజివీడు



థాట్ ఫర్ ద మంత్

# ఆలస్యం ఆశీర్వాదం కోసమే

*నా ప్రాణమా, నీవేల క్రుంగియున్నావు? నాలో నీవేల 'తొందరపడుచున్నావు'? దేవునియందు నిరీక్షణయుంచుము. ఆయనే నా రక్షణకర్త, నా దేవుడు. ఇంకను నేనాయనను స్తుతించెదను. (కీర్తన 42:11)*

చాలామంది విశ్వాసులు సరైన ఉద్యోగం, వివాహం, మంచి ఆరోగ్యం, పిల్లల కోసం, కుటుంబంలో ఆర్థికలోటు, సమస్యలు తీరేటట్లు, ఉద్యోగంలో ప్రమోషన్....మొదలైన వాటికోసం ఎంతో కాలం నుంచి ప్రార్థిస్తూ, ఎదురుచూస్తూ ఉన్నారు. ఇలాంటి పరిస్థితులగుండా వెళ్తున్నప్పుడు వారి బాధ, వేదన, చింత వర్ణనాతీతం. ఆలస్యం ఆశీర్వాదమా? లేక శాపమా? ఆలస్యం అవ్వడానికి కారణాలు ఏంటి? అలాంటి పరిస్థితుల్లో ఎలా స్పందించాలి?

## ఆలస్యం దేవుని మహిమకోసమే

లాజరు రోగియైయున్నాడని యేసు విని తానున్న చోటనే ఇంక రెండు దినములు గడిపెను (యోహాను11:6). అంతకుముందే "ఈ వ్యాధి మరణము కొరకు వచ్చినది కాదు గాని దేవుని కుమారుడు దాని వలన మహిమపరచబడునట్లు దేవుని మహిమ కొరకు వచ్చినది" అని యేసుక్రీస్తు ప్రభువు చెప్పాడు. లాజరు మరణించే వరకు తానున్న చోటనే ఉన్నప్పుడు, దేవునికే మహిమ కలగాలని ప్రభువు భావించాడు.

## ఆలస్యం నీ మేలు కోసమే

నీ ఉద్యోగం విషయం, వివాహ విషయం ఆలస్యమవుతుంది; అంటే, దేవుడు నీకు ఇవ్వబోతున్న వాటి ద్వారా దేవునికి మహిమ, నీకు క్షేమము దాగి ఉన్నాయని అర్థం చేసుకోవాలి. మన కోసం ఆయన ఎంతో గొప్ప మేలు దాచి ఉంచాడని బైబిల్ చెబుతుంది (కీర్తన 31:19). ఆయన సిద్ధపరచిన మేలును స్వతంత్రించుకోవడానికి మనం ఆయన కోసం కనిపెట్టాలి. చింతించే కాలం వృథా అయ్యే కాలం కాదు, గానీ ఆ సమయాన్ని మనం సరిగా ఉపయోగించుకొంటే అది మనల్ని శక్తివంతుల్ని చేస్తుంది.

నీయందు దయచూపవలెనని యెహోవా ఆలస్యము చేయుచున్నాడు. ఆయన నిమిత్తం కనిపెట్టువారందరు ధన్యులు (యెషయా 30:18). ఆయన 'ఆలస్యము చేస్తున్నాడు' అని నీవు అనుకొనే సమయము – నీకు మరింత మేలు చేకూర్చడానికి ఆయన చేసే ప్రయత్నం.

## దేవుని సమయం ఉత్తమమైనది

సమయపాలన చేతకాని వారు, పనులు ఆలస్యంగా చేస్తారు. కానీ మన దేవుడు అలా కాదు కదా! ఆయన సమయం ఉత్తమమైనదిగా ఉంటుంది. ఏది, ఎప్పుడు, ఏవిధంగా నీకు అందించాలో ఆయనకు తెలుసు. అంతేకాదు, ఆయన నీకిచ్చేది, నీకివ్వదలచినది నీవు స్వీకరించగలిగే వాతావరణం నీ జీవితంలో ఏర్పడాలి. దానికోసం ఆయన నిన్ను సిద్ధపరుస్తున్నాడని అర్థం చేసుకోవాలి. ఆలస్యం

జరుగుతుందని ఈ సందర్భంగా నీకు అనిపిస్తుంది. రోమా 8:28లో చెప్పినట్లు, సమస్తము నీ మేలు కొరకే ఆయన సమకూర్చి జరిగించుచున్నాడు. దేవుడు తన టైంటేబుల్ కంటే ముందుగా వెళ్ళడు. ఆయన ప్రణాళికలు, ఉద్దేశాలు నీ జీవితంలో నెరవేరాలి.

## ఆలస్యానికి కారణం దేవునిని అడగాలి

2 పేతురు 3:9లో ప్రభువు రెండవ రాకడ గురించి పేతురు ప్రస్తావిస్తూ – 'ఆయన తన వాగ్దానం గురించి ఆలస్యము చేసేవాడు కాదు. అందరు రక్షింపబడాలని దీర్ఘశాంతము చూపుతున్నాడు' అని చెబుతున్నాడు. ఆయన తాను ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలనే ఉద్దేశంతోనే దానిని (ఆ వాగ్దానాన్ని) నిర్మించినట్లు యిర్మీయా 33:2లో చదువుతాము. కాబట్టి జరుగుచున్న ఆలస్యం ఎందుకు జరుగుతుందో గ్రహించే జ్ఞానం కొరకు దేవునిని అడుగుదాం.

నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులు నేనెరుగుదును.... అవి సమాధానకరమైనవి, క్షేమకరమైనవి.. హానికరమైనవి కావు (యిర్మీయా 29:11). కాబట్టి ఆయన ఉద్దేశాల నెరవేర్పు కొరకు ఎదురుచూస్తూ ఉండడం మంచిది. ఈ వేచివుండే కాలంలో నీ ఓర్పు, నీ సహనం రెట్టింపు కావాలి.

## దావీదు మాదిరి

దావీదు వేచియున్న విధానాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. సౌలును చంపే అవకాశం వచ్చినప్పుడు ఆ పనిచేస్తే, తాను కొన్ని సంవత్సరాలముందే రాజు అయ్యేవాడు. పైగా దేవుడు అప్పటికే అతని అభిషేకించాడు. సుమారు 14 సంవత్సరాలు ఓర్పుతో కనిపెట్టాడు. ఆయన కనిపెడుతున్న సమయంలో కొన్నిసార్లు తొట్రుపడినా దేవుని మహాకృపను బట్టి కోలుకున్నాడు. కీర్తన 34:10లో "సింహపు పిల్లలు లేమిగలవై ఆకలిగొనును, యెహోవాను ఆశ్రయించువారికి ఏ మేలు కొదువైయుండదు" అని రాశాడు. దేవుని కోసం సహనంతో కనిపెట్టడం నేర్చుకొన్నాడు (కీర్తన 40:1). ఎంతో అద్భుతంగా పరిపాలనను చేయగలిగాడు.

## ఆలస్యం ఎందుకు అవుతుంది? ఆ సమయంలో ఏంచేయాలి?

ఉద్యోగం పొందడం కోసం చాలా కష్టపడాలని తెలిసి కూడా, సమయాన్ని వ్యర్థం చేసే వారిని చూస్తున్నాం. అలాంటి వారు కొంతకాలం తరువాత నిరాశలోకి నిస్పృహలోకి వెళ్ళిపోతున్నారు. దేవుడు మనకిచ్చిన సమయాన్ని, బాధ్యతను సరైన రీతిలో నిర్వహించాలి.

అనారోగ్యంతో సతమతమవుతున్న వారు, స్వస్థత ఎందుకు ఆలస్యం అవుతుంది అనుకొనే వారు ప్రభువు చిత్తానికి తమ్మును తాము అప్పగించుకోవాలి. మనసంతా మన బాధల మీద పెట్టకుండా, దేవుని పని మీదకు మరల్చడానికి ప్రయత్నం చేద్దాం. ప్రార్థించేటప్పుడు మన ఫీలింగ్స్ అన్నీ దేవునికి తెలియపరచడానికి వెనుకాడవద్దు. 44వ కీర్తనలో "ప్రభువా, మేల్కొనుము, నీవేల నిద్రించుచున్నావు" (వ.23) అనే ప్రార్థన మనం చదువుతాము.

సంతానము లేనివారు ఎన్నో సంవత్సరాల నుండి ఆయన దయ కోసం కనిపెట్టుచున్నారు. దేవుడు రాహేలు మొర విని గర్భం తెరిచాడు (ఆది 30:22). మరింత ఆసక్తితో, ఆశతో ప్రార్థన చేద్దాం. 'దాసుల కన్నులు తమ యజమానుని చేతి తట్టు... చూచునట్లు మన దేవుడైన యెహోవా మనలను కరుణించు వరకు మన కన్నులు ఆయన తట్టు చూచుచున్నవి" (కీర్తన 123:1-2) కనిపెట్టడం నేర్చుకుందాం. అదే సమయంలో దేవుని ఉద్దేశాన్ని తెలుసుకొని దానిని అంగీకరించిన ప్రొ. ఇనాక్ కుటుంబాన్ని గుర్తు చేసుకొందాం. దత్తత తీసుకోవడం గురించి ఆలోచించడం కూడా మంచిది.

ఆర్థిక సమస్యలు మరియు కుటుంబములో సమస్యలు ఉన్నప్పుడు ప్రభువుతట్టు చూడడం, ప్రభువుని బట్టి మనలను మనము ప్రోత్సాహపరచుకోవడం (1 సమూ 30:6) నేర్చుకుందాం. ఆయన తన సమయంలో అన్ని విషయాల్ని చక్కగా చేస్తాడనే విషయాన్ని మర్చి పోవద్దు (ప్రసంగి 3:11). నీ భారం యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును (కీర్తన 55:22).

కీర్తన 42:11 – నా ప్రాణమా, నీవేల కృంగి యున్నావు? నాలో నీవేల 'తొందరపడుచున్నావు'? దేవునియందు నిరీక్షణయుంచుము. ఆయనే నా రక్షణకర్త, నా దేవుడు. ఇంకను నేనాయనను స్తుతించెదను. ఈ కీర్తనాకారుని వలె మనలను మనం ప్రోత్సాహపరచుకుందాం. దేవుని పనిలో కూడా పాల్గొందాం. ఈవిధంగా చేయడానికి దేవుడు నిన్ను బలపరచును గాక!

– **యం. జాన్ కెనడీ,** నందిగామ

# అవసరాలకు అనుగుణంగా ఇద్దాం

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు.

నా మందిరములో ఆహారముండునట్లు పదియవభాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి; దీని చేసి మీరు నన్ను శోధించినయెడల నేను ఆకాశపువాకిండ్లను విప్పి,పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు (మలాకీ 3:10).

ఆనాటి దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులే కాదు మానవులమైన మనమంతా దేవుని యొద్ద దొంగిలుచున్నాము. 8,9 వచనాలలో చూసినప్పుడు "మీరు నా యొద్ద దొంగిలితిరి", "ఈ జనులందరు నా యొద్ద దొంగిలుచునే యున్నారు" అని దేవుడు మాట్లాడుచున్నాడు. నిజంగా మనలను మనం విమర్శించుకొందాం. ఆయన సన్నిధిలో ఆయన వాగ్దానములను నమ్మి, ఆ వాగ్దానములను ఎత్తిపట్టి పట్టుదలగా, పరిచర్యలోని అవసరాల కోసం క్రమంగా ప్రార్థిస్తున్నామా? ఇవ్వడానికి మన మనసులను సిద్ధపరచుకొంటున్నామా?. మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొని రండి అని అంటున్నాడు. మన పరిచర్య అవసరాలు ఎన్నో ఉన్నాయి. విద్యార్థుల మధ్య సువార్త ప్రకటనకు, వారిని శిష్యులుగా తీర్చిదిద్దడం కొరకు ఎంతో డబ్బు సమకూర్చాల్సిన అవసరత ఉంది. ఎంతోమంది గ్రాడ్యుయేట్స్, విద్యార్థులు, స్టాఫ్ ఇస్తూనే ఉన్నారు. ఇంకా ఇవ్వడంలో అభివృద్ధి చెందుదాం. విశ్వాసులమైన మనము ధర్మశాస్త్రం క్రింద లేము, కృప కిందే ఉన్నాము. పదవ భాగంతో తృప్తిపడకూడదు. ఆశీర్వదించబడిన కొలది, వర్ధిల్లిన కొలది ఇద్దాం. మనకున్నదంతా దేవునిదేనని గుర్తించి దేవునికి సంపూర్ణంగా సమర్పించుకొందాం. మన దేవుడు ఆకాశమను మంచి ధన నిధి తెరచి పట్టజాలనంత విస్తారంగా ఆశీర్వదించదలచాడు. మనము మోసుకొని వెళ్ళలేనంత విస్తారంగా ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే ఇష్టపూర్వకంగా, హృదయపూర్వకంగా ఇవ్వాలి. విస్తారంగా ఇవ్వడం మన మేలుకోసం, ఆయన మహిమ కోసమే.

### స్తుతించండి

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి
2. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు ఇవ్వడానికి అవసరమైన రూ. 1,00,000/- వచ్చిన దాన్ని బట్టి
3. బిల్డింగ్ ఫండ్‌కు వచ్చిన 8 లక్షలను బట్టి

### ప్రార్థించండి

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2023 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**MINIMUM MONTHLY NEED OF UESI AP: RS.13,87,000/- (AS PER THE ACM 2023)**
**Minimum amount to be sent to UESI every month: Rs.4,50,000/-(as per the ACM'23)**
**Total need for the month of June 2023: Rs.18,37,000/-**

## JULY - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | --- | Field Staff Salaries | 5,25,903.00 |
| General Fund | 15,48,383.00 | Field Staff HRA, CA, MA & TA | 3,00,208.00 |
| Staff Support | 1,23,900.00 | Office Staff Salaries | 1,82,601.00 |
| | | UESI | 4,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | Punjab | 11,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | To SWF | 37,000.00 |
| | | Other Expenditure | 64,019.00 |
| **Total** | **16,72,283.00** | | **16,72,283.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-08-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# నేనే



సొంత ప్రపంచాన్ని
చుట్టూ కప్పేసుకొని
తూర్పు నుంచి
పడమర దాకా
నేనే!

మనసు మేఘాల్లో
ఆలోచనల పొద్దు
పొడిచినప్పటి నుంచి
నిద్దుర కొండల్లోకి
అస్తమించే వరకు
వెలగాల్సింది
నేనే!

పెదవులు పోగయ్యే
ప్రతి సభలో
రహస్య ఎజెండా
నేనే!

సముద్రమంత స్వార్థం
పొగడ్తల నదులన్నీ
కలవాల్సింది
నాలోనే
గుర్తింపుకు
బీటలు పడ్డాయా
సునామీలే

నా భుజాల మీద
నన్ను మోసుకొంటూ
బజారులన్నీ తిరుగుతాను

ప్రతి అద్దంలో
నా బొమ్మే కనబడాలని
మోచేతుల సాయంతో
మిగతా వారిని
పక్కకు నెడతాను

ప్రాణనాడుల నిండా
పేరుకు పోయిన అహం
పక్కవాడిలోకి ప్రేమ
ప్రవహించేదెలా

గుండె మధ్యలో నాటుకొన్న
నేను అనే కొయ్యకు
నన్ను కట్టేసుకొని
నా చుట్టూ నేను
తిరిగీ తిరిగీ
అలసి పోయాను

నాలో నేను
చిక్కుకున్నాను
నా కాళ్ళకింద పడి
నలిగి పోయాను
విడిపించవా ప్రభూ
నన్ను
నా నుంచి

– డా. తాళ్ళూరి ప్రసాద్